

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శనివారం 01, ఆగస్టు 2026 16 పేజీలు

అడ్డుకోవాల్సింది పోయి.. అడ్డంగా బుక్కయ్యాడు



2లో

ఆపరేషన్ ముస్కాన్-12



సక్సెస్..!

జిల్లాలో 63 మంది బాల కార్మికులకు విముక్తి

పనుల్లో నిమగ్నమైన చిన్నారులను గుర్తించి సీడబ్ల్యూసీకి అప్పగింత

బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 26 కేసులు

అన్ని శాఖల సమన్వయంతో విజయవంతమైన ప్రత్యేక ఆపరేషన్ : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

2లో

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, విడిచిపెట్టబడిన చిన్నారులను గుర్తించి వారి భవిష్యత్తును భద్రపరచే లక్ష్యంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-12 జగిత్యాల జిల్లాలో విజయవంతంగా ముగిసింది. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో నెల రోజుల పాటు చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో 63 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 26 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

భారీ వర్షాలతో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి

బ్రేక్..!

ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వరద నీరు.. నిలిచిన యంత్రాలు

40 వేల టన్నులకుపైగా ఉత్పత్తి నష్టం.. కోట్లలో ఆర్థిక ప్రభావం



16లో

గోదావరిఖని, ప్రభాత వార్త: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి భారీగా వరద నీరు చేరడంతో శుక్రవారం నాటికి పలు ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. గనులలో బురద పేరుకుపోవడంతో భారీ యంత్రాలు పనిచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో బొగ్గు తవ్వకం, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు స్తంభించిపోయాయి. రామగుండం, ఇల్లందు, మణుగూరు, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ప్రాంతాల్లోని ఓపెన్‌కాస్ట్ గనులు వర్ష ప్రభావానికి గురయ్యాయి.

ఆకలి కడుపుతో

అక్షరాభ్యాసం!



2లో

జూన్ 15 నుంచి మధ్యాహ్న భోజనం బంద్

ఇంటి నుంచే క్యారేజీలతో వస్తున్న విద్యార్థులు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని విద్యాధికారులు

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

కోనరావుపేట రూరల్, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కోనరావుపేట మండలంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిగా అటకెక్కింది. విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ 15 నుంచి ఇప్పటివరకు విద్యార్థులకు భోజనం అందకపోవడంతో చిన్నారులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుని పాఠశా లకు రావాల్సిన పరిస్థితి నెలకొంది.

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ..!



2లో

విద్యార్థులతో ముచ్చట.. సదుపాయాలపై కలెక్టర్ ఆరా

వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చిత్రా మిశ్రా

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త: కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలకు వచ్చిన కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం రాత్రి జమ్మికుంటలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులు, వడకగదులు, వంటగది, స్టోర్‌రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, “ఎలా చదువుకుంటున్నారు... స్కూల్‌కు ఎలా వెళ్తున్నారు... నడుచుకుంటూ వెళ్తున్నారా... భోజనం బాగుంటుందా... మెనూ ప్రకారం టిఫిన్లు పెడుతున్నారా... దోమల సమస్య ఉందా... ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...“ అంటూ ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ చిత్ర మిశ్రా సూచించారు.

ఆపరేషన్ ముస్కాన్-12 సక్సెస్..!

జిల్లాలో 63 మంది బాల కార్మికులకు విముక్తి

పనుల్లో నిమగ్నమైన చిన్నారులను గుర్తించి సీడబ్ల్యూసీకి అప్పగింత

బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 26 కేసులు

అన్ని శాఖల సమన్వయంతో విజయవంతమైన ప్రత్యేక ఆపరేషన్ : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, విడిచిపెట్టబడిన చిన్నారులను గుర్తించి వారి భవిష్యత్తును భద్రపరచే లక్ష్యంతో నిర్వహించిన **ఆపరేషన్ ముస్కాన్-12** జగిత్యాల జిల్లాలో విజయవంతంగా ముగిసింది. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో నెల రోజుల పాటు చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో 63 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 26 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.ప్రతి ఏడాది బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది జూలై 1 నుంచి 31 వరకు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ వెల్లడించారు. చిన్నారులను ప్రమాదకరమైన పనుల నుంచి బయటకు తీసుకురావడం, తప్పిపోయిన లేదా నిరాశ్రయులైన పిల్లలను గుర్తించి రక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు

ఆపరేషన్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లాలోని ప్రతి సబ్‌డివిజన్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్‌ను నియమించి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి హోటళ్లు, టీ దుకాణాలు, పరిశ్రమలు, గ్యారేజీలు, వ్యాపార సంస్థలు, ఇటుక బట్టీలు, వర్క్‌షాపులు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించిన వెంటనే వారిని రక్షించి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

63 మంది చిన్నారులకు విముక్తి

నెల రోజుల పాటు కొనసాగిన తనిఖీల్లో జిల్లాలో మొత్తం 63 మంది బాల కార్మికులను గుర్తించి రక్షించారు. వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచి, చట్ట ప్రక్రియ ప్రకారం వారి భవిష్యత్తు కోసం అవసరమైన చర్యలు చేపట్టారు. బాలల విద్య, సంరక్షణ, పునరావాసంపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.



యజమానులపై 26 కేసులు

18 సంవత్సరాల లోపు పిల్లలతో వివిధ పనులు చేయిస్తున్న యజమానులపై పోలీసులు కఠినంగా వ్యవహరించారు. తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 26 మంది యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

బాలల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వానిదే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యాభ్యాసం చేయాల్సిన వయస్సులో చిన్నారులను పనుల్లోకి నెట్టడం చట్టవిరుద్ధమే కాకుండా వారి భవిష్యత్తును నాశనం చేసే చర్య అని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

సమాచారం ఇవ్వండి... చర్యలు తీసుకుంటాం ఎస్పీ అశోక్ కుమార్

ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించినా, చిన్నారులను బలవంతంగా పనిలో పెట్టుకున్నా, లేదా తప్పిపోయిన, విడిచిపెట్టబడిన పిల్లల సమాచారం తెలిసినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్-100కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమన్వయంతోనే విజయం

ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతం కావడంలో పోలీసు శాఖతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేశాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆకలి కడుపుతో అక్షరాభ్యాసం!“

పస్తుల చదువులు..!

జూన్ 15 నుంచి ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం బంద్

ఇంటి నుంచే క్యారేజీలతో వస్తున్న విద్యార్థులు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని విద్యాధికారులు

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

కోనరావుపేట రూరల్, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కోనరావుపేట మండలంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిగా అటకెక్కింది. విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ 15 నుంచి ఇప్పటివరకు విద్యార్థులకు భోజనం అందకపోవడంతో చిన్నారులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుని పాఠశాలకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. వంట మనుషులు లేరనే కారణంతో అధికారులు చేతులెత్తేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు ఆకలితో చదువు కోకుండా ఉండేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. కొన్ని జిల్లాల్లో ఉదయం అల్పాహార పథకాన్ని కూడా అమలు చేస్తోంది. అయితే కోనరావుపేట మండలంలో మాత్రం కనీసం మధ్యాహ్న భోజనం కూడా అందకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తోంది.



రాజన్న గొల్లపల్లిలో దారుణ పరిస్థితి

మండలంలోని రాజన్న గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఒకప్పుడు ఏడుగురు విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఐదుగురు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోయారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం లేకపోవడంతో ఇంటి నుంచే భోజనం తీసుకు వస్తున్నారు. శుక్రవారం ఆ ఇద్దరూ కూడా పాఠశాలకు గైర్హాజరు కావడంతో ఉపాధ్యాయుడు ఒక్కరే పాఠశాలలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రామన్నపేటలో నాణ్యతలేని భోజనం

రామన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి మధ్యాహ్న భోజనం సక్రమంగా అందడం లేదు. శుక్రవారం గ్రామ సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడు చొరవతో ఒకరిని తీసుకొచ్చి వంట చేయించినా, నాణ్యతలేని పులిహోర మాత్రమే విద్యార్థులకు అందించారు. అప్పటికే చాలామంది విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్నే తిన్నారు.

ఎంఈఓ నిర్లక్ష్యమే కారణమా..?

మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించడం మండల విద్యాశాఖ అధికారుల బాధ్యత. వంట మనుషులు అందుబాటులో లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కూడా అధికారులదే. కానీ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.నిబంధనల ప్రకారం తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓతో కూడిన కమిటీ మధ్యాహ్న భోజన నిర్వహణను పర్యవేక్షించాలి. అయితే మండలంలోని ఈ రెండు పాఠశాలల్లో పరిస్థితిని పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పిల్లల ఆరోగ్యంపై ప్రభావం

పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రధాన ఆధారం. అలాంటి పథకం అమలు కాకపోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, చదువులపై ప్రతికూల ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భోజనం కోసం ఇంటిపైనే ఆధారపడాల్సి రావడంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం కూడా దెబ్బతింటోందని చెబుతున్నారు.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, రెండు పాఠశాలల్లో వెంటనే నాణ్యమైన మధ్యాహ్న భోజనం పునరుద్ధరించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

“మేము వంట చేయమంటారా?“

“రెండు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పలుమార్లు గ్రామస్తులకు చెప్పినా గిట్టుబాటు కాదని ఎవరూ రావడం లేదు. వారు రాకపోతే మేమే వంట చేసి పెట్టలేం కదా. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం“ అని ఎంఈఓ మురళినాయక్ తెలిపారు.

మురళినాయక్, ఎంఈఓ, కోనరావుపేట

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ..!

విద్యార్థులతో ముచ్చట.. సదుపాయాలపై కలెక్టర్ ఆరా

వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చిత్రా మిశ్రా

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త: కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలకు వచ్చిన కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం రాత్రి జమ్మికుంటలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులు, పడకగదులు, వంటగది, స్టోర్‌రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, “ఎలా చదువుకుంటున్నారు... స్కూల్‌కు ఎలా వెళ్తున్నారు... నడుచుకుంటూ వెళ్తున్నారా... భోజనం బాగుంటుందా... మెనూ ప్రకారం టిఫిన్లు పెడుతున్నారా... దోమల సమస్య ఉందా... ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...“ అంటూ ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ చిత్ర మిశ్రా సూచించారు. వంటగది, స్టోర్‌రూమ్‌లోని బియ్యం, పప్పులు, కూరగాయలు, నూనె తదితర నిత్యావసర సరుకులను పరిశీలించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని సిబ్బందిని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి వస్తువు గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రెండు వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భవనాల్లో ఉన్న లోపాలను గుర్తించి సమగ్ర అంచనా వ్యయం (ఎస్టిమేషన్) సిద్ధం చేయాలని టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. రిపేర్లను ఆలస్యం చేయకుండా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జమ్మికుంట డిప్యూటీ తహసీల్దార్ శంకర్, టీజీడబ్ల్యూఐడీసీ ఏఈ రమేష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పలువుర్ పాల్గొన్నారు.

అడ్డుకోవాల్సింది పోయి....

అడ్డంగా బుక్కయ్యాడు

గంజాయితో దొరికిన ఈగిల్ టీం కానిస్టేబుల్

వివరాలు వెల్లడించిన ఏసిపి

కరీంనగర్ క్రైమ్ ప్రభాతవార్త: మాదకద్రవ్యాల నియంత్రణ విభాగంలో పని చేస్తూ స్నేహితు ని కోసం అతని ప్రత్యర్థి పై అక్రమ కేసు పెట్టేందుకు గంజాయి నిల్వచేసిన ఈగల్ టీం కానిస్టేబుల్ ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుని వివరాలను కొత్తపెళ్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ ఏసిపి విజయ్ కుమార్ వెల్లడించారు. కరీంనగర్ మండలం సీతారాంపూర్ లో నివాసముంటున్న ఈగల్ టీం కానిస్టేబుల్ మెడబోయిన నాగరాజు వద్ద గంజాయి నిల్వ ఉందన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 370 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును విచారించగా చిగురుమామిడి మండలం కొండాపూర్ కు చెందిన శ్రీనివాస్ కు నాగరాజుకు పరిచయం ఉంది. అదే గ్రామంలో శ్రీనివాస్ కు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తులకు మధ్య భూతగాదాలు ఉండడంతో అవి ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించిన కొలిక్కి రాకపోవడంతో అతన్ని కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో నాగరాజు శ్రీనివాసులు కలిసి పథకం పన్నారు. స్నేహితుని కోసం కానిస్టేబుల్ నాగరాజు వరంగల్ నుంచి గంజాయి తెప్పించి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఎరువుల దుకాణంలో పెట్టాడు. తిరిగి పోలీసులకు సమాచారం అందించి చిరుమామిడి పోలీస్టేషన్లో కేసు నమోదయ్యేలా చేసి కటకటాల పాలు చేశారు. వరంగల్ నుంచి తెప్పించిన గంజాయిలో కిలో గంజాయి శ్రీనివాస్ రెడ్డి దగ్గర దొరికినట్లు చూపించగా మిగిలిన 3 70 గ్రాముల గంజాయిని తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు నాగరాజు ఇంట్లో దాడులు నిర్వహించి గంజాయి తోపాటు నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసిపి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఏసిపి వెంట ఇన్స్పెక్టర్ లు కోటేశ్వర్, బొల్లం రమేష్, పాల్గొన్నారు.



శాంతి భద్రతల పరిరక్షణే పోలీస్ లక్ష్యం

వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు

గొల్లపల్లి, కమ్మరిపేటలలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

సరైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు గుర్తింపు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:





శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కోనరావుపేట మండలం గొల్లపల్లి, కమ్మరిపేట తండాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 39 ద్విచక్ర వాహనాలను గుర్తించి, సంబంధిత యజమానులు అవస రమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచిం చమన్నారు.నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి, వారి ప్రస్తుత కదలికలు, స్థితిగతులపై ఆరా తీశామన్నారు.ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం కల్పించడం, అసాంఘిక కార్యకలా పాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మన్నారు.ఈ కార్య క్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.కాలనిలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో చందుర్తి సర్కిల్ సి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి, రమేష్, మోతిలాల్, సిబ్బంది పాల్గొన్నారు

పోక్సో కేసులో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

-రూ.5 వేల జరిమానా విధించిన పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం

రామగిరి ప్రభాతవార్త రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది.పోలీసుల వివరాల ప్రకారం రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శివరాంనగర్ కు చెందిన ఎండీ రహీంపాషా (36)పై 2020 నవంబర్ 5న నమోదైన కేసులో ఈ తీర్పు వెలువడింది. బాధిత బాలిక తండ్రి తన 14 ఏళ్ల కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో రామగిరి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.138/2020 కింద ఐపీసీ సెక్షన్ 363 ప్రకారం కేసు నమోదు చేశారు.దర్యాప్తు సందర్భంగా బాలికను గుర్తించి ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేయగా, నిందితుడు ప్రేమ వివాహం పేరుతో మోసపూరితంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు వెల్లడైంది. దీంతో కేసులో ఐపీసీ సెక్షన్లు 366ఏ, 376(2)(3)తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్-6ను చేర్చి కోర్టుకు ఆల్టరేషన్ మెమో సమర్పించారు.అప్పటి ఏసీపీ వి. ఉమేందర్, ఎస్సై ఏ. మహేందర్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. అనంతరం చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. విచారణ అనంతరం పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీమతి స్వప్నరాణి ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించారు. దీంతో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కేసులో నేరం రుజువై నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్, భరోసా లీగల్ కౌన్సిలర్ ఎం. సాధ్యారాణిల సేవలను అధికారులు అభినందించారు.పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి, ఏసీపీ మడుతా రమేష్ పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో సహకరించిన మంథని సీఐ బుద్దె స్వామి, రామగిరి ఎస్సై టీ. శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ ఎస్.కె. షాహాబాజ్, లైజన్ ఆఫీసర్ పి. కోటేశ్వరరావులను రామగుండం పోలీస్ కమిషనర్, డీఐజీ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ అభినందించారు.

మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్

-ప్రధాన నేరస్తులు పాత కేసులో లొంగుబాటు పిటి వారెంట్‌పై తీసుకొస్తాం

-అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:



నగరంలోని భగత్‌నగర్‌లో జరిగిన దోపిడీ కేసులో ఎట్టకేలకు చిక్కుముడి వీడింది. ఈ కేసులో బాధితుని అల్లుడు మనవడే ప్రధాన సూత్రధారిగా బయటపడింది. ఈ దోపిడి కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,09,000 నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను కరీంనగర్ కు తీసుకొచ్చిన సందర్భంగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ మీడియా ముందు హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ నివాసంలో ఈనెల 22న అర్ధరాత్రి సమయంలో దుండగులు డమ్మీ పిస్టళ్లు, కత్తులతో చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలం, నిందితులు పారిపోయిన మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన వారని పోలీసులు నిర్ధారించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టి యూపీ పోలీసుల సహకారం తీసుకున్నారు. కరీంనగర్ నుంచి వెళ్లిన ప్రత్యేక బృందం ట్రాన్సిట్ వారెంట్ పై ముగ్గురు నిందితులను జూలై 29న అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలోసల్మాన్/భూరే/యాదవ్ (22), సల్మాన్/విమాన్ (22), మొహమ్మద్ హసీన్ (19) లో ఉన్నారు. వీరి వద్ద నుండిరూ.2,09,000 నగదు,43.67 గ్రాముల బంగారు ఆభరణాలు 64.98 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ సొంత అల్లుడు రజావుద్దీన్ , మనుమడు అజీమ్ రజా ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్ , అజీమ్ రజా కరీంనగర్ పోలీసులు అరెస్టు చేస్తారని భయంతో మీరట్ లో నమోదైన గత కేసుల్లో అక్కడి కోర్టులో లొంగిపోయినట్లు డిసిపి వెంకటరమణ తెలిపారు. ప్రస్తుతం అక్కడి జైల్లో ఉన్న నిందితులను కూడా పిటి వారెంట్ పై తీసుకొస్తామని తెలిపారు.

నేరాలు-దారుణాలు



చేపల వేటకు వెళ్లి పాము కాటుతో మత్స్యకారుడు మృతి

పెగడపల్లి, ప్రభాతవార్త:



మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన మన్నే మల్లయ్య (66) గురువారం రాత్రి విషపూరిత పాము కాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మల్లయ్య లింగాపూర్ గ్రామ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లగా చెరువులో పాము కాటుకు గురై అస్వస్థతకు గురికాగా, అది గమనించి అక్కడ చేపలు పడుతున్న మిగతా జాలర్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో, కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషపూరిత పాము కాటు కారణంగానే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మన్నే హనుమక్క ఫిర్యాదు మేరకు ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ అక్రమాలపై విజిలెన్స్ ఫోకస్

సుల్తానాబాద్‌లో రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

అక్రమాలు తేలితే కఠిన చర్యలు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం నిల్వలు, కేటాయింపులు, సరఫరాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న అనుమానాల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శుక్రవారం సుల్తానాబాద్ పట్టణ శివారులోని పలు రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.కరీంనగర్ రీజినల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి బస్సు రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా కేటాయించిన సీఎంఆర్ ధాన్యం, మిల్లింగ్ చేసి అప్పగించిన బియ్యం, ప్రస్తుతం మిల్లుల్లో ఉన్న నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, సంబంధిత రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ధాన్యం నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నాయన్న నివేదికల నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.తనిఖీల్లో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీ సీతారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనిల్, ప్రశాంత్, వరుణ్, డిప్యూటీ తహసీల్దార్ దినేష్, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. సీఎంఆర్ కేటాయింపులు, నిల్వలు, సరఫరాల్లో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తులకు జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, ప్రభాతవార్త:

జిల్లాలోనీ తిమ్మాపూర్ ప్రాంతంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు గంజాయి అమ్మేందుకు వచ్చి పోలీసులకు పట్టుబడిన నేరంలో నిందితులు ముగ్గురికి ఐదు సంవత్సరముల జైలు శిక్ష, 5000 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విశాఖపట్నం సత్యవరం కు చెందిన ఏనుగు సురేష్ (22)కీర్తి ఇజ్రాయిల్ (22)లు స్నేహితులు....త్వరగా డబ్బు సంపాదించాలని విశాఖ మన్యం ప్రాంతంలో గంజాయి కొని దానిని హైదరాబాద్ బోయినపల్లి కి చెందిన వెల్లూరు కట్ట సందీప్ కుమార్ (24) తో కలిసి అమ్మాలనుకున్నారు.అందులో భాగంగా 2022 అక్టోబర్ 19న సాయంత్రం తిమ్మాపూర్ మండల కేంద్రం ప్రాంతంలో ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులకు అమ్మేందుకు వచ్చి వేచి ఉండగా ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్ రెడ్డి పట్టుకోగా వారి వద్ద కిలోన్నర గంజాయి లభించింది. ఈ సంఘటనపై ఎల్ఎండి పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేయగా సిఐ శశిధర్ రెడ్డి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్ వారిని విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నిందితులు ముగ్గురికి జైలు శిక్ష,జరిమానా విధించారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి

ఆర్డీవోకు బీసీ యువజన సంఘం వినతి



కోరుట్ల టౌన్, ప్రభాతవార్త : విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు, పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని కోరుతూ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో కోరుట్ల ఆర్డీవో ఎల్. జీవాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, నిరుద్యోగ జేఏసీ అధ్యక్షులు నీలం వెంకటేష్ సంయుక్త పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి షికారి గోపికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను జిల్లా, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ.8,000 కోట్ల ఫీజు బకాయిలను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని, కొత్త విధానాలతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు.విద్యార్థుల హక్కు విద్య – ఫీజు రీయింబర్స్‌మెంట్ మా హక్కు” అని నినదిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా తక్షణమే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్ సీనియర్ నాయకులు నిమ్మల రంజిత్ కుమార్ సురేందర్ పట్టణ అధ్యక్షులు ఏనుగందుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సోమ గంగాధర్

కోరుట్ల ప్రభాతవార్త :



ఎంపీపీస్ ఏజీ కోరుట్ల పాఠశాలలో ఎస్ జి టి విధులు నిర్వహిస్తున్న సోమ గంగాధర్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ ఉపాధ్యాయ సేవా ప్రస్థానంలో గంగాధర్ విద్యార్థుల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేశారని వక్తలు కొనియాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎస్టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్ , పాలెపు శివరామకృష్ణ లు మాట్లాడుతూ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు ఉద్యోగం నుంచి మాత్రమే విరమిస్తారని, ఆయన అందించిన జ్ఞానం, విద్యార్థుల జీవితాలపై చూపిన ప్రభావం చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. గంగాధర్ సేవలు ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం గంగాధర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఆనందరావు గంగాధర్, జ్యోత్స్న, కోరుట్ల మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిరిపురం రాజేష్ ,అన్నం మహేష్ కథలాపూర్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నల్ల సాయికుమార్, నల్ల రాజ్ కిరణ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పూర్ణచందర్, కవిత, మహేష్ పరంధం, ఆడేపు రాజశేఖర్ తోపాటు సోదర సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశాలకు జువ్వాడి నర్సింగ్‌రావును అధికారికంగా ఆహ్వానించాలి

క్యాబినెట్ హోదాతో పట్టణాభివృద్ధికి మరిన్ని నిధులు రాబట్టే అవకాశం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 3వ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్ డిమాండ్



మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వెల్మ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులై క్యాబినెట్ హోదా పొందిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావును గౌరవించి, ఆహ్వానించేందుకు మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని 3వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా స్పోక్ పర్సన్ బత్తుల నరేష్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బత్తుల నరేష్ మాట్లాడుతూ ఎలాంటి అధికారిక పదవి లేనప్పటికీ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నర్సింగ్‌రావు గత రెండున్నర ఏళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి తీవ్రంగా శ్రమించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సుమారు రూ. 80 కోట్ల నుండి రూ. 100 కోట్ల వరకు అభివృద్ధి నిధులను తీసుకువచ్చారని తెలిపారు. అంతేకాకుండా, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆసుపత్రి బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు 60 శాతం నుండి 70 శాతం వరకు లబ్ధి చేకూరేలా చేశారన్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 8 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించి పేదలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే ఉందన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, సీఎంకు అత్యంత ఆప్తుడైన జువ్వాడి నర్సింగ్‌రావుకు ఇప్పుడు క్యాబినెట్ హోదా దక్కినందున, ఆయన సహకారంతో మెట్‌పల్లి మున్సిపాలిటీని మరింత వేగంగా అభివృద్ధి చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జారీ చేసిన ప్రోటోకాల్ ఉత్తర్వుల లేఖలోని ప్రతి వాక్యాన్ని సమావేశంలో చదివి వినిపించిన నరేష్ ప్రభుత్వ కార్యక్రమాలు, మున్సిపల్ సమావేశాల సమాచారాన్ని ముందస్తుగా నర్సింగ్‌రావుకు తెలియజేయాలన్నారు. రాబోయే మున్సిపల్ సాధారణ సమావేశాలకు, ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి ఆయనను అధికారికంగా ఆహ్వానిస్తూ భాగస్వామ్యం చేయాలని మున్సిపల్ పాలకవర్గాన్ని, అధికారులను కోరారు.

వర్ష బాధితులకు అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్

మెట్‌పల్లి అర్బన్, ప్రభాతవార్త:



గత రెండు రోజులుగా మెట్ పల్లి లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. మెట్‌పల్లి పట్టణంలోని ఇంద్రనగర్‌కు చెందిన సోమిరెడ్డి రాజు, శాంతినగర్‌కు చెందిన శిరీష కుటుంబాల ఇళ్లు వర్షాలకు కూలిపోవడంతో ట్రస్ట్ సభ్యులు వెంటనే స్పందించి బాధితులను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం బ్యాగ్‌తో పాటు నిత్యావసర వస్తువులను అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వర్షాల కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రకృతి విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలోని అంబులెన్స్‌తో పాటు ఇతర వాహనాలు కూడా ప్రజలకు సేవలందించేందుకు అందు బాటులో ఉంటాయని వెల్ల డించారు. ట్రస్ట్ సభ్యుల సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందించారు.

కోరుట్ల వార్త

మైసమ్మ తల్లి దేవాలయం పునఃనిర్మాణంకై వినతి

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని గడి బురుజుల వద్ద అతి పురాతనమైనటువంటి శ్రీ గడి మైసమ్మ తల్లికి గతంలో వందల సంవత్సరాల నుండి పూజ కార్యక్రమాలు జరుగుతూ ఉండేవని ప్రస్తుతం ఆ ప్రాంతంలో చెత్త చెదారం వేస్తూ కొందరు కావాలని మైసమ్మ దేవాలయాన్ని నిర్వీర్యం చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తునారనీ పాలకులు పట్టించుకోక కాల క్రమేన అట్టి దేవాలయం మరుగున పడేలా ఉన్నదని హిందువుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన మైసమ్మ తల్లి దేవాలయాన్ని పునఃనిర్మించుటకు సహకరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ ఎండోమెంట్ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్ ల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూప్ రావు, కోరుట్ల మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్ కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కార్యదర్శి , సుధావేని మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, తులసి కృష్ణ, గిన్నెల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులు మ్యకల గణేష్, ఎర్ర రాజేందర్, చెట్లపల్లి సాగర్, ఉపాధ్యక్షులు, తాళ్లపేల్లి శ్రీనివాస్, బీజేపీఎం పట్టణ అధ్యక్షులు దమ్మ సంతోష్ రెడ్డి, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు బెక్కం అశోక్, నేమూరి విజయ్, ఓం ప్రకాష్, ఇర్నల స్వామీ, ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు .

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన ఎం.డి. సాదుల్లా ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న పదో తరగతి సహచరులు మానవత్వాన్ని చాటుకున్నారు. తమ వంతుగా విరాళాలు సేకరించి మొత్తం రూ.51 వేలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని సాదుల్లా కుమార్తె పేరుపై పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, గ్రామ సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో డిపాజిట్‌కు సంబంధించిన పత్రాలను సాదుల్లా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సాదుల్లా కుటుంబానికి అండగా నిలిచిన సహచరుల సేవాభావాన్ని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సాత్పడి శ్రీనివాస్, శ్రీధర్, రమేష్, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న ఆలయంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్

ఓదెల, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద దేవాలయాల్లో ఒకటైన పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లిఖార్జున స్వామి (మల్లన్న) దేవాలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని స్థానిక నాయకులు, ఆలయ అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి, ఆలయ ఈవో సదయ్య,ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, ఏఎంసి మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కొమిర సర్పంచ్ గోలి లింగారెడ్డి, ఆలయ డైరెక్టర్ ఉప్పుల శ్రావణ్ కుమార్ స్థానిక నాయకులు పశ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, నాగపురి రవి గౌడ్, చింతం కుమారస్వామి, రాచర్ల రాకేష్, మీనుగు సంతోష్, రాచర్ల ఓదెలు,ఆలయ డైరెక్టర్లు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రాసా బాసగా సమీక్ష సమావేశం

సమస్యలపై ప్రశ్నించిన సర్పంచులు

ప్రభాతవార్త కోనరావుపేట కోనరావుపేటమండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి అభివృద్ధిపై సమీక్షా సమావేశం రసాభసాగా జరిగింది. కోనరావుపేట మండల అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ డెప్యూటీ సీఈవో లక్ష్మినారాయణ అధ్యక్షత నా శనివారం జరిగింది. సమావేశంలో వివిధ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిద సమస్యలపై సర్పంచులు ప్రశ్నించారు.సర్వేనెంబర్ 211లో రైతులకు పట్టాలు లేక యూరియా రావడంలేదని,. గతంలో పట్టాలుండగా నాలుగేళ్ల క్రితం తొలగించారని వెంటనే ఆ భూ సమస్య పరిష్కరించాలని రెడ్డితండా సర్పంచ్ బానోత్ నరేశ్ కోరారు. గ్రామంలో విద్యుత్ సంచాయతీ కరెంట్ గ్రామంలో విద్యుత్ స్తంభాలు మంజూరై ఆరు నెలలవుతున్నా ఇప్పటివరకు వేయలేదని మామిడిపల్లి సర్పంచ్ లక్ష్మారెడ్డి అన్నారు. గ్రామపంచాయతీ వీధిలైట్ల కరెంట్ బిల్లులకు కూడా గృహజ్యోతి లాగా రాయితీ ఇవ్వాలని రాజన్న గొల్లపల్లి సర్పంచ్ బొజ్జ మల్లేశం కోరారు. గతంలో ఉన్న జీపీల విద్యుత్ బకాయిలు కూడా ఇప్పుడు చెల్లించమంటే జీపీలో డబ్బులు లేవని, డీజిల్ కి కూడా డబ్బులు లేవని మండిపడ్డారు. ధర్మారం సర్పంచి బాలాజీ మాట్లాడుతూ మండలంలో 107 ఇందిరమ్మ ఇల్లు మంజూరుకాగా ధర్మారంలో నేను ప్రతిపక్ష పార్టీలో ఉన్నందున ఒక్కటి కూడా ఇవ్వలేదని సర్పంచ్ బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికార పార్టీ సర్పంచులకు, బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం జెడ్పీ డెప్యూటీ సీఈవో మాట్లాడుతూ అధికారులు, సర్పంచులు సమన్వయంగా ఉండాలని ప్రజా ప్రతినిధుల సమస్య లు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వరలక్షి మ్మ, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, ఎంపీడీవో స్నిగ్ధ. అన్ని గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



మండల అభివృద్ధికి సహకరించాలి

-మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్

రుద్రంగి ప్రభాతవార్త: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రుద్రంగిమండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ సర్పంచ్లు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంబంధిఅధికారులు ప్రగతి నివేదికను సభకు వివరించారు. ఫారెస్టు అధికారులు సభలో ఫారెస్టు కంచెను దాటకూడదని వివరించగా ఫారెస్టు అధికారుల సహకారంతోనేకొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఫారెస్టు భూముల్లో చెట్లను ధ్వంసం చేసి భూములు చదును చేస్తున్నారని గిరిజన సర్పంచ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మానాల,గిరిజనతండాలో విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని గిరిజన సర్పంచ్లు సభలో తెలిపారు. బడితండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండవైద్యాధికారిని అందుబాటులో ఉంచాలని బడితండా సర్పంచ్ రాందాస్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, తాసీల్దార్పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్లు, మండల అధికారులు పాల్గొన్నారు.



కురిసిన వర్షం... మురిసిన రైతు నిండిన చెరువు

మత్తడి దూకిన మూధపల్లి ఊర చెరువు

చందుర్తి/ప్రభాతవార్త:చందుర్తి మండలంలో మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువులకు జలకళ సంతరించుకుంది.. వర్షంతో పలు గ్రామాల్లోని ఒర్రెలు, వంకలు పొంగిపొరుతున్నాయి. మండలంలోని ఎన్గల్ గ్రామంలో కల్వర్టు వద్ద భారీగా వర్షం నీరు ప్రవహిస్తుంది. మూడపల్లి గ్రామంలోని ఊర చెరువు మత్తడి దూకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లోని లోతట్టు కాలనీలు, ఇళ్లలోకి వరద నీరు చేరడంతో తొలగిస్తు న్నారు. మండలంలోని గ్రామాల్లోని పత్తి చేనులలో వరద నీరు నిలిచింది.ఎన్గల్ గ్రామంలోని ఒర్రెలు వరద నీటితో ప్రవహిస్తున్నాయి. మిగతా గ్రామాల్లో కూడా ఒర్రెలు పొంగి ప్రవహిస్తున్నాయి.



వేములవాడ భీమేశ్వర ఆలయంలో రెండో రోజు వైభవంగా వరుణయాగం

సకాలంలో వర్షాలు కురవాలని ఆధ్యాత్మిక కార్యక్రమాలు

రేపు పూర్ణాహుతితో ముగియనున్న యాగ మహోత్సవాలు

వేములవాడ, ప్రభాతవార్త:

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం, సకాలంలో వర్షాలు కురవాలని తలపెట్టిన మూడు రోజుల వరుణయాగ మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం వైభవంగా సాగాయి. ఉదయం ఋష్యశృంగ ముని పూజల్లో భాగంగా ప్రతిష్ఠాపన దేవతా పూజలు, గౌరీ పూజ, విశ్వశాంతి కార్యక్రమాలు, వాస్తు హోమం, నవగ్రహ హోమం, పరివార దేవతా హోమం, సంతత ధారాభిషేకాలను అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అలాగే రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఏకాంతంగా జరిపారు. అనంతరం వరుణ పర్జన్య దీపారాధన, పరిచయ హోమాలు జరిగాయి. జూలై 30 నుండి ఆగస్టు 1 వరకు జరుగుతున్న ఈ యాగంలో శనివారం ఉదయం మూలమంత్ర హోమం అనంతరం ఉదయం 10.30 నుండి 11.00 గంటల మధ్య పూర్ణాహుతితో వేడుకలు ముగుస్తాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శనివారం నాటి పూర్ణాహుతి, ఇతర వైదిక కార్యక్రమాల ఏర్పాట్లపై అర్చకులు, అధికారులతో సమీక్ష నిర్వహించి, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు.



జలసిరి, పారిశుద్ధ్యంపై అధికారుల దిశానిర్దేశం

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



జలసిరి కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేయడంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శన్ రావు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి హ్యాండ్బోర్ వద్ద కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, ప్రతి గ్రామంలో ఐదు పంటకుంటలు తప్పనిసరిగా నిర్మించాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, మురుగునీటి నిల్వలతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని సర్పంచులకు తెలిపారు.సమావేశంలో పెద్దపల్లి డీఎల్పీఓ దేవకీదేవి, మిషన్ భగీరథ సహాయ ఇంజనీర్లు శ్రీకాంత్, సూర్యతేజ, పంచాయతీరాజ్ సహాయ ఇంజనీర్ సచిన్, మండల పంచాయతీ అధికారి కుమారి మోనికతో పాటు మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ఆల్ఫోర్స్ పెద్దపీట

ఆల్ఫోర్స్ లో ఘనంగా గోరింటాకు సంబరాలు

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తున్నాయని ఆ సంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. ఆషాఢ మాసం సందర్భంగా సుల్తానాబాద్లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులతో ఘనంగా గోరింటాకు సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గోరింటాకు మహిళల చేతులకు అందాన్ని చేకూర్చడమే కాకుండా శరీరానికి చల్లదనాన్ని అందించి వేడిని తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఆషాఢం, శ్రావణమాసం, బతుకమ్మ, వరలక్ష్మి వ్రతం, వివాహాలు వంటి శుభసందర్భాల్లో గోరింటాకు పెట్టుకోవడం భారతీయ సంస్కృతిలో ఒక ముఖ్యమైన సంప్రదాయమని పేర్కొన్నారు.డిజిటల్ యుగంలో సంప్రదాయ పండుగల పట్ల ఆసక్తి తగ్గుతున్న నేపథ్యంలో విద్యార్థులకు భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు ఆల్ఫోర్స్ లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, కుటుంబ విలువల పట్ల అవగాహన పెంపొందుతుందని చెప్పారు.గోరింటాకు వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూలవాగు ప్రాజెక్టు కట్ట పరిశీలన

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు కట్టను వేములవాడ ఆర్డీవో కె.ఎస్.కుమారి పరిశీలించారు. మూలవాగు ప్రాజెక్టు 19అడుగల సామర్థం ఉండగా ఎడమ కాలువ తూం వద్ద బుంగ పడింది. దీంతో గురువారం అధికారులు బుంగ పడిన ప్రాంతంలో ఇస్కు బస్తాలను అడ్డుకట్టగా వేశారు. అయితే ప్రమాదకరంగా మారిన బుంగతో సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఇక్కడ తహసీల్దార్ వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



మెట్‌పల్లి లో భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు

పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

- బాధితులకు సహాయం, పునరావాస చర్యలు

చేపట్టాలని అధికారులకు ఆదేశాలు





మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త: మెట్‌పల్లి పట్టణంలో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇండ్లు, రోడ్లు, ప్రభుత్వ భవనాలను మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పలు వార్డుల్లో పర్యటించి నష్ట తీవ్రతను అంచనా వేశారు. పట్టణం లోని 3వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఓఇంటి గోడలు పూర్తిగా కూలిపోయిన ఘటనను పరిశీలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. 16వ వార్డులో లక్ష్మీ థియేటర్ ఎదురుగా ఉన్న ఓ షాపులో సీలింగ్ కూలిపోవడంతో కంప్యూటర్లు, ఫర్నిచర్ తదితర సామగ్రి భారీగా దెబ్బతిన్నాయి. 11వ వార్డులో పెద్ద చెరువు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు చేరి విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడగా, వెంటనే నీటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. 22వ వార్డులో ప్రభుత్వ పాఠశాల భవనానికి గోడలపై పగుళ్లు ఏర్పడి వర్షపు నీరు లోపలికి చేరడంతో పుస్తకాలు, ఫర్నిచర్ తడిసిపోయిన పరిస్థితిని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ నివసించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వర్షాల వల్ల తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బత్తుల నరేష్, రెబ్బస్ మహేష్ యాదవ్, అంగడి పురుషోత్తం, నాయకులు అరిసె మురళి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం కృషి

రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు



మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలం లోని బండలింగాపూర్ గ్రామంలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారి బోనాల సందర్భంగా అమ్మవారి ఆల్నయలో ప్రత్యేక పూజలు చేసి, ఇటీవల మహాలక్ష్మి అమ్మవారి ఆలయంకి వెళ్లే దారికి సీసీ రోడ్డు మంజూరు చేయగా.. పని పూర్తి అవ్వడంతో సీసీ రోడ్డు ని జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేస్తుందని పేర్కొన్నారు. ఈకార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిటి రాజేందర్,సర్పంచ్ కనగందుల లక్ష్మీ సంజీవ్, ఉప సర్పంచ్ ఆకుల రాకేష్ పటేల్,మాజీ సర్పంచ్ జంగా గంగ స్వామి,నాయకులు పెరుమాళ్ల నారాయణ గౌడ్, గంగోని క్రాంతి కుమార్,కూకట్ల వేణుగోపాల్,మ్యాకల తుకారాం,ముదాం శివ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న కస్తూరి సంతోష్

దొరికిన బంగారాన్ని తిరిగి అప్పగింత

మల్లాపూర్, ప్రభాతవార్త:



సమాజంలో నిజాయితీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించే ఘటన మల్లాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కిరాణా వ్యాపారి కస్తూరి సంతోష్, తన దుకాణంలో మర్చిపోయిన సుమారు 10 గ్రాముల బంగారాన్ని అసలు యజమానికి అప్పగించి అందరి ప్రశంసలు అందు కున్నారు. వివరాల్లోకి వెళితే.. మల్లాపూర్ మండలం వేంపల్లి వెంకట్రావు పేట గ్రామానికి చెందిన తోట పెద్ద రాజారెడ్డి (60) కస్తూరి సంతోష్ కిరాణా దుకాణానికి వచ్చి కొనుగోళ్లు చేసి వెళ్లే సమయంలో తన వద్ద ఉన్న సుమారు 10 గ్రాముల బంగారాన్ని అక్కడే మర్చిపోయాడు. దానిని గమనించిన సంతోష్ వెంటనే యజమానిని గుర్తించి సంప్ర దించేందుకు ప్రయత్నించారు. ఉదయం నుంచి పలుమార్లు ఫోన్ చేసి చివరకు రాజారెడ్డిని దుకాణానికి పిలిపించి బంగారాన్ని క్షేమంగా ఆయనకు అందజేశారు.ప్రస్తుతం పోగొట్టుకున్న విలువైన వస్తువులు తిరిగి దొరకడం అరుదైన పరిస్థితుల్లో, కస్తూరి సంతోష్ ప్రదర్శించిన నిజాయితీ అందరికీ ఆదర్శంగా నిలిచిందని గ్రామస్తులు కొనియాడారు. ఆయన సేవాభావం, నిబద్ధతను అభినందిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ ఘాతంతో గేదె మృతి

మెట్‌పల్లిరూరల్,ప్రభాతవార్త:



మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలో వరదకాలువ వద్ద ఈర గణేష్ అనే రైతుకు చెందిన గేదె శుక్రవారం విద్యుత్ ఘాతంతో మృతి చెందినట్లు బాధితుడు పేర్కొన్నారు.గ్రామంలోని వరద కాలువ గట్టు సమీపంలోని విద్యుత్ స్థంభానికి విద్యుత్ లీకేజీ ఉండటంతో గేదె ప్రమాదానికి గురైనట్లు రైతు తెలిపాడు.ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి,విద్యుత్ లీకేజీని నివారించడంతో పాటు రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.కాగా వరద కాలువ వెంబడి గట్ల వద్ద విద్యుత్ మోటార్ల డబ్బాలు అజాగ్రత్తగా అమర్చిన వాటిని సక్రమంగా అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మెట్‌పల్లి వార్త



అమెరికాలో స్వర్ణ పతకం సాధించిన మెట్‌పల్లి బాలుడు తనుష్

మెట్‌పల్లి కల్చరల్ ప్రభాతవార్త :





మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మాడిశెట్టి ప్రభాకర్ మనుమడు, హరీష్ -అర్చన దంపతుల కుమారుడు తనుష్, సంపూర్ణ భగవద్గీత లోని 700 శ్లోకాలను కంఠస్థం చేసి అమెరికాలో నిర్వ హించిన ప్రత్యేక కార్యక్రమంలో తన అసాధారణ ప్రతిభను చాటు కున్నాడు. భగవద్గీత శ్లోకాలను నిర్దోషంగా పారాయణం చేసి స్వర్ణ పతకం అందుకోవడం ద్వారా తనుష్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు. ఈ అరుదైన విజయంతో కుటుంబ సభ్యులతో పాటు మెట్‌పల్లి పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా తనుష్ ఈ విజయాన్ని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి దివ్య ఆశీస్సులతో సాధించానని కుటుంబ సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి దేశానికి, మెట్‌పల్లి పట్టణానికి మరింత పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

మాటు కాలువ గండి పూడ్చాలి

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త:



మండలంలోని జగ్గాసాగర్ పెద్ద చెరువులోకి నీరు వచ్చే మాటుకాలువకు ఐదు సంవత్సరాలక్రితం గండి పడ్డా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదని, మాటు కాలువ గండి ని పూడ్చాలని జగ్గాసాగర్ సర్పంచ్ పుల్ల జగన్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈసందర్భంగా గండి పడ్డ మాటు కాలువ వద్దకు రైతులతో వెళ్లి,వారు మాట్లాడుతూ.. కాలువ గండి పూడ్చాలని అధికారులను అడిగితే ప్రత్తిపాదనలు పంపినామని అంటున్నారు,కానీ ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్ద చెరువు లోనికి నీళ్లు రాక ఇబ్బంది గా ఉందన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే సంజయ్ కల్పించుకుని కాళేశ్వరం రివర్సు పంపు ద్వారా చెరువు నింపించేలా చూడాలని,గండి పుడ్చడానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించాలని రైతులు కోరారు.కోరుచున్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్మ చిన్నయ్య,రైతులు సార గంగారెడ్డి, కలిగొట రవి,అన్నారపు ముత్తన్న, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ ను సందర్శించిన జపాన్ ప్రతినిధులు

..తంగళ్ళపల్లి ప్రభాతవార్త.

.తంగళ్ల పల్లి మండలం బద్దెనపల్లి లోని అంతర్జాతీయ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌ను జపాన్ ప్రతినిధులు సందర్శించారు.జపాన్‌కు నైపుణ్యమైన భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లను తీర్చిదిద్దే లక్ష్యంతో హనా విస్టా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది.ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని అంతర్జాతీయ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్య అవకాశాలను పరిశీలించేందుకు సంస్థ ప్రతినిధులు సైట్ విజిట్ నిర్వహించారు.ఈ పర్యవేక్షణ సంస్థ సీఈఓ సయూరి మత్సునో తెలంగాణ ఐఏఎస్ అధికారి హరి ప్రసాద్ ఆదేశానుసరం పర్యవేక్షించారు.డ్రైవింగ్ శిక్షణ విధానం,మౌలిక సదుపాయాలు,శిక్షణ పరికరాలు,నిర్వహణ ప్రమాణాలు,మొత్తం శిక్షణ వాతావరణాన్ని ప్రత్యక్షంగా జపాన్ ప్రతినిధులు పరిశీలన చేశారు.భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరస్పర సహకారం పై చర్చించి దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ భాగస్వామ్యం అమల్లోకి వస్తే తెలంగాణ యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ పర్యవేక్షణలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్, మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, ఐటీడీర్ ప్రిన్సిపాల్ దొరయ్ మురుగన్ తదితరులు పాలుగొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

సిరిసిల్ల మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతి చెందిన మరియు 60 ఏళ్ల నిండి రిటైరైన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, అదనపు కార్మికులను నియమించి ప్రస్తుతం పని చేస్తున్న వారిపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఈపీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ జిందం కళకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ కార్మికులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారి సంక్షేమం కోసం పాలకవర్గం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతి చెందిన, రిటైర్మెంట్ అయిన దాదాపు 10 మంది కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చే వరకు తాత్కాలికంగానైనా ఉపాధి కల్పించాలి. దీనివల్ల ఆ కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. పనిభారం తగ్గింపుపట్టణ విస్తరణకు



అనుగుణంగా అదనపు కార్మికులను నియమించి, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలి. 2009 నుండి 2012 వరకు ఉన్న మూడు సంవత్సరాల మున్సిపల్ కార్మికుల ఈపీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలి. మున్సిపల్ ఛైర్మన్ మరియు కమిషనర్ స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పవర్ బోర్ వద్దా ఇంకుడు గుంతల ఏర్పాట్లు

మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



మున్సిపల్ సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ఆమోదించడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా తెలిపారు . శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం చైర్ పర్సన్ జిందం కల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 25 అంశాలను సమావేశంలో ఏర్పాటు చేయగా 24 అంశాలను ఆమోదం తెలపడం జరిగిందన్నారు. రగుడు మున్సిపల్ డంపింగ్ యార్డ్ అభివృద్ధి పరుచుటకు షెడ్డుల నిర్మాణం , సి.సి ప్లాట్ ఫామ్స్ నిర్మాణం ఇంటర్నల్ సి.సి , రోడ్డు నిర్మాణ పనులు చేపట్టుటకు రూ.80.00 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి చేయడం జరిగిందన్నారు . సానిటేషన్ నిర్వహణలో భాగంగా రెండు ఎలక్ట్రికల్ ఆటోలు, ఒక జెసిబి కొనుగోలు కొరకు రూ.50.00 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి చేశామన్నారు. డ్రైన్ కల్వర్టు ల నిర్మాణం, డ్రైనేజీలు, సిసి రోడ్ల ప్యాచ్ వర్కులు, మొత్తం (9) పనులకు గాను రూ. 16.55 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరూ చేశామన్నారు . వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలు నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా మొత్తం (9) పనులకు రూ. 20.50 లక్షలు మంజూరు తీర్మానం చేయడం జరిగిందన్నారు. పట్టణంలోని వార్డులలో పవర్ బోర్స్ ఏరియాలో సుమారు 400 పైగా ఇంకుడు గుంతలు నిర్మాణం చేయుటకు మొత్తం (6) పనులకు గాను రూ. 30.00 లక్షలు కేటాయించామన్నారు. అభివృద్ధి పనులపై పరిపాలన ఆమోదం తీర్మానం చేశామన్నారు. ఈ సాధారణ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వైస్ ఛైర్మన్ దార్ల సందీప్, డి ఇ వాణీ, అంజయ్య , వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో బోనాలు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



సిరిసిల్ల ఆరెకటిక సంఘం వారి ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. బోనాల వేడుకలలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొని ఆ అమ్మవారి కృపకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలన్నారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలందరూ వ్యవసాయం వ్యాపారం అన్ని రంగాలలో వృద్ధి సాధించాల దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక సంఘం రాష్ట్ర నాయకులు గజబింకర్ చందు గారు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు గజబింకర్ మహేందర్ గారు, ఉపాధ్యక్షులు గజబింకర్ బాబు గారు,గజబింకర్ దశరథం గారు, ఇతర కార్యవర్గ సభ్యులు కుల పెద్దలు ఆడపడుచులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

జిల్లా బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ఏర్పాటు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ , జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి సమక్షంలో జిల్లా మహిళా మోర్చా నూతన కమిటీని శుక్రవారం జిల్లా బిజెపి కార్యాలయంలో ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శుల దాసరి పూర్ణిమ,మంత్రి సంతోష , జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డబోయిన మనోజ్ఞ భీమనపల్లి శోభ, తుమ్మల రాజవ్వ ,జిల్లా కార్యదర్శులు ఎక్కలదేవి జమున, గుంటుక మంజుల, జొన్నకంటి తేజశ్రీ, జిల్లా అధికార ప్రతినిధి సుధా గోని నిశ్చిత జిల్లామన్ కి బాత్ కన్వీనర్ గంగాధర మమత, నియమించడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ నూతనంగా నియమితులైన మహిళా మోర్చా జిల్లా కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు

సిరిసిల్ల వార్త



రాజన్న సిరిసిల్ల జిల్లాలో అదనపు ఎస్పీ చంద్రయ్య ఘన వీడ్కోలు

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:



రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చంద్రయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై చంద్రయ్యను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 35 సంవత్సరాల పాటు చంద్రయ్య అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో సేవలందించి శాఖకు మంచి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. పదవీ విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమే ముగింపు అని, సమాజ సేవకు కాదన్నారు. 1991లో ఎస్సైగా ప్రవేశించిన చంద్రయ్య.. వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో, రామగుండం, హన్మకొండ, సైబరాబాద్‌లలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగున్నర సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించారు. ఆయన చేసిన సుదీర్ఘ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవ, ఉత్తమ సేవ పథకాలు.. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్‌ఖి పురస్కారం లభించాయి. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త



:కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి ప్రతి కార్యకర్త నాయకులు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో 3, 16, 28 వార్డులలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ఆగస్టు మూడులో పు ఎస్ ఐ ఆర్ పూర్తవుతుందని తెలిపారు . బి ఎల్ ఓ ఇచ్చిన ఫామ్ నింపి ఇవ్వనివారు గడువులోగా అందించే విధంగా వార్డు కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఎస్ ఐ ఆర్ నింపి అందించకుంటే జరిగే నష్టాన్ని వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి పేద పౌరుడికి అందేలా చూసే బాధ్యత వార్డు కాంగ్రెస్ నాయకులకు ఉందని అన్నారు . పట్టణంలో ఇల్లు లేని వారు ఉండకూడదని ఉద్దేశంతో ప్రతి పేద బడుగు బడుగు వర్గాలకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు పొందేలా చూడాలన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వారూప ,కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత , కాంగ్రెస్ చేనేత సెల్ టౌను అధ్యక్షులు గుడిసెట్టి బాలరాజ్, నాయకులు శ్రీ గాధ మైసయ్య , రవీందర్ , రమేష్ , దేవదాసు , శివ తదితరులు పాల్గొన్నారు

రోళ్లవాగు ప్రాజెక్ట్ నీటిని వృథా పోనివ్వొద్దు

అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించాలి
తూము షట్టర్లు బిగించి నీటిని నిల్వ చేయాలి
మాజీ జెడ్.పీ.టి. సి కొలుముల రమణ డిమాండ్

బీర్‌పూర్ ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని అతిపెద్ద ప్రాజెక్టయిన రోళ్లవాగు నీటిని నిల్వ చేసి, శూన్యమవుతున్న రైతుల కష్టాలను తీర్చాలని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడినప్పటికీ, ఆ ఆనందం రైతులకు ఎంతోసేపు నిలవలేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారుల నిరక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని నాయకులు విమర్శించారు. ప్రాజెక్టు తూములకు సరైన షట్టర్లు (తలుపులు) బిగించకపోవడం వల్ల, ప్రాజెక్టులోకి వచ్చిన నీరంతా వృథాగా బయటకు పోతోందని ఆరోపించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, వారి ఉదాసీనత వల్లే కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారుతోందని మండిపడ్డారు.మూడు మండలాలకు వరప్రదాయిని రోళ్లవాగు ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తే సారంగాపూర్, బీర్పూర్, ధర్మపురి మండలాల పరిధిలోని ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడమే కాకుండా, వ్యవసాయానికి సమృద్ధిగా నీరు అందుతుందని పేర్కొన్నారు. సంవత్సరానికి రెండు పంటలు పండించుకోవడానికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని, తక్షణమే అధికారులు స్పందించి తూములకు తలుపులు బిగించి నీటిని నిల్వ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుమన్, మాజీ జడ్పీటీసీలు, గుడిసె జితేందర్ యాదవ్, ముక్క శంకర్ యాదవ్, మాజీ ఎంపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణరావు, చెరుపూరి సుభాష్ యాదవ్, ఆడెపు తిరుపతి మరియు వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించి,ఆర్థిక సాయం

అందించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ పోరండ్ల గ్రామంలో అధిక వర్షాల కారణంగా రవి అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా కూలిపోయింది.ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, యువజన నాయకుడు తాటిపర్తి సి.కె. రెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కూలిపోయిన ఇంటిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన,తీవ్ర మనోవేదనకు గురైన కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్పారు.అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి,వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి నష్టానికి సంబంధించిన నివేదిక తయారు చేయాలని సూచించారు.వర్షానికి ఇల్లు కోల్పోయి రోడ్డున పడిన బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా నూతన ఇల్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,నాయకులు రాధకిషన్,రాజిరెడ్డి,వెంకటేష్ గౌడ్,విష్ణు,సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్‌లోని పాత ఎస్సీ కార్యాలయ భవనంలో తాత్కాలిక ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయం 202627 విద్యా సంవత్సరానికి బాలవాటిక1 (నర్సరీ)నుంచి ఐదవ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 1, 2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 14, 2026 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.40 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు.దరఖాస్తులను పూర్తిగా పూరించి, అవసరమైన ధ్రువపత్రాలతో కలిసి కేంద్రీయ విద్యాలయం చెల్గల్, తాత్కాలిక క్యాంపస్, పాత ఎస్సీ కార్యాలయ భవనం, ధరూర్ క్యాంప్, జగిత్యాల చిరునామాలో సమర్పించాలని సూచించారు.ప్రవేశాలు బాలవాటిక1, బాలవాటిక2, బాలవాటిక3, ఒకటవ తరగతి, రెండవ తరగతి, మూడవ తరగతి,నాల్గవ తరగతి , ఐదవ తరగతుల్లో ఖాళీలకు మాత్రమే నిర్వహించబడతాయని తెలిపారు. ప్రవేశాలకు కి వి ఎస్ ప్రవేశ మార్గదర్శకాలు-202627లో నిర్దేశించిన వయోపరిమితి, నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రేషన్ కార్డు/బీపీఎల్/ఆదాయ ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవా ధృవీకరణ పత్రం/బదిలీ వివరాలు, అలాగే కే వి ఎస్ ప్రవేశ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ఇతర పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.ప్రవేశాలు కేంద్రీయ విద్యాలయ సంస్థ (కే వి ఎస్) ప్రవేశ మార్గదర్శకాలు-202627కుఅనుగుణంగా మాత్రమే నిర్వహించబడతాయని, పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయాన్ని లేదా కే వి ఎస్ మార్గదర్శకాలను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వేములవాడ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో

36 ఎజెండా అంశాలకు ఆమోదం

రాబోయే వినాయక నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు
ఇండోర్ అధ్యయన యాత్రకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

వేములవాడ, ప్రభాతవార్త:వేములవాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి రూపొందించిన 36 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులు సమగ్రంగా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం అనంతరం చైర్మన్ పుల్కం రాజు మీడియాతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పురస్కరించుకుని భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరఫున ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలిచిన ఇండోర్‌ను సందర్శించి, చెత్త నిర్వహణ, వ్యర్థాల నుంచి ఎరువుల తయారీ విధానాలపై అవగాహన పెంచుకునేందుకు కౌన్సిలర్లతో అధ్యయన యాత్ర చేపడుతున్నామని వెల్లడించారు.పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారుల ద్వారా నోటీసులు జారీ చేసి పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో పట్టణాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఇటీవల రూ. 2.60 కోట్లతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభించుకున్నామని గుర్తుచేశారు. రూ. 15 కోట్ల నిధులతో కులసంఘాల భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరు చేసి శరవేగంగా పూర్తి చేస్తున్నామని వివరించారు. ప్రతిపక్షాల్లో ఉన్న ఒక్కరిద్దరు కౌన్సిలర్లు గత పదవులపై వ్యామోహం తగ్గక అనవసర విమర్శలు చేస్తున్నారని, రాజకీయాలకు అతీతంగా పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



జగిత్యాల వార్త



మహిళా డిగ్రీ కళాశాలలో మహిళల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త



జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో మహిళల అక్రమ రవాణా పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు మరియు బాలికలపై జరుగుతున్న అక్రమ రవాణా ప్రమాదాలు, కారణాలు మరియు నివారణ చర్యలపై విద్యార్థినులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వుమెన్ ఎంపవర్‌మెంట్ హబ్ సిబ్బంది మరియు సఖి సెంటర్ సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు భద్రతా చర్యలు, సహాయక సేవలు మరియు అందుబాటులో ఉన్న ప్రభుత్వ మద్దతు వ్యవస్థల గురించి వివరించారు.మహిళల అక్రమ రవాణా విభాగానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సౌజన్య కార్యక్రమంలో పాల్గొని చట్టపరమైన అంశాలు, ఫిర్యాదు విధానాలు మరియు సమయానికి స్పందించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అవగాహన ద్వారానే ఇలాంటి నేరాలను నివారించవచ్చని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కళాశాల సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన ఎస్పీ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు.ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు బి. ఆనందం (ఏఎస్ఐ), ఎమ్.శ్రీనివాస్ (ఏఎస్ఐ), జి.రవి (హెడ్ కానిస్టేబుల్) లను జిల్లా ఎస్పీ శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు అందిస్తామని అన్నారు.అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్ బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్.ఐ శ్రీకాంత్ సిబ్బంది మరియు రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు...

కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:

అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డికి యునైటెడ్ కింగ్డమ్ నుంచి "సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్" లభించిందనీ ఒక ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు.విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలు, అసాధారణ నాయకత్వం, విద్యా ప్రమాణాల పెంపును గుర్తించి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఈ అంతర్జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసిందనీ తెలిపారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో ఈ సందర్భంగా ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యా సంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ గౌరవం సంస్థల విద్యా విధానానికి నిదర్శనమని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం విజయాల కోసం కృషి చేయాలని పిలుపుని చ్చారు.వలువురు ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆయనను అభినందించారు.



నేడు, రేపు బిల్డ్ ఎక్స్‌పో2026....

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

కరీంనగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 1, 2న 6వ ఖిబిల్డ్ ఎక్స్‌పో 2026ఖిను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ఏసీసీఈఐ) కరీంనగర్ సెంటర్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక నిర్మాణ ఉత్పత్తులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ



ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 9:00 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే సామాన్య ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తుల ఎంపికకు ఈ వేదిక ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఫౌండేషన్ నుంచి ఇంటీరియర్ వరకు అవసరమైన స్టీల్, సిమెంట్, పెయింట్స్, హార్డ్‌వేర్, లిఫ్ట్, ఎలక్ట్రికల్, శానిటరీ ఉత్పత్తులతో పాటు దేశంలోని ప్రముఖ కంపెనీల సామగ్రిని ఒకే ప్రాంగణంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే నిపుణులు ఉచితంగా సలహాలు అందిస్తారని, సందర్శకులకు ప్రవేశం ఉచితంతో పాటు లక్కీ కూపన్లు అందజేస్తామని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పలు ప్రాంతాల ప్రజలు, ఇంజనీర్లు, బిల్డర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య సేవే మానవతకు నిజమైన ప్రతిరూపం

డా. ఎల్. రాజభాస్కర్ రెడ్డి

కరీంనగర్ హెల్త్, ప్రభాతవార్త:

వైద్యవృత్తి అత్యంత పవిత్రమైనదని, ప్రాణాలను కాపాడుతూ ప్రజలకు సేవలందించే వైద్యులు భగవంతుని తర్వాత భగవంతుని స్థానంలో నిలుస్తారని ప్రజ్ఞాభారతి కరీంనగర్ చైర్మన్ డా. ఎల్. రాజభాస్కర్ రెడ్డి అన్నారు. గ్లోబల్ ఫినాకిల్ ఫౌండేషన్ అందించే ప్రతిష్ఠాత్మక బెస్ట్ కపుల్



వైద్యులు బ్రాండ్ ఎథైట్ అవార్డు-2026కు నగరానికి చెందిన దంత వైద్యులు డా. వామన్, డా. సౌజన్య దంపతులు ఎంపికైన సందర్భంగా ప్రజ్ఞాభారతి కరీంనగర్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రాజభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దంపతుల అంకితభావం, వృత్తినిబద్ధత, రోగుల పట్ల సేవా దృక్పథమే వారికి ఈ అరుదైన గౌరవాన్ని అందించిందన్నారు. ప్రజ్ఞాభారతి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీఏ డి.నిరంజనాచారి మాట్లాడుతూ దంత వైద్య రంగంలో డా. వామన్, డా. సౌజన్య దంపతులు విశిష్ట సేవలతో మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. జిల్లా అధ్యక్షులు సముద్రాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల నగేష్ రెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, జె. సత్యనారాయణ రెడ్డి, గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్య దంపతులను ఘనంగా సన్మానించారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తులకు జైలు శిక్ష...

కరీంనగర్ లీగల్, ప్రభాతవార్త:

జిల్లాలోనీ తిమ్మాపూర్ ప్రాంతంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు గంజాయి అమ్మేందుకు వచ్చి పోలీసులకు పట్టుబడిన నేరంలో నిందితులు ముగ్గురికి ఐదు సంవత్సరముల జైలు శిక్ష, 5000 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విశాఖపట్నం సత్యవరం కు చెందిన ఏనుగు సురేష్ (22)కీర్తి ఇజ్రాయిల్ (22)లు స్నేహితులు....త్వరగా డబ్బు సంపాదించాలని విశాఖ మన్యం ప్రాంతంలో గంజాయి కొని దానిని హైదరాబాద్ బోయినపల్లి కి చెందిన వెల్లూరు కట్ట సందీప్ కుమార్ (24) తో కలిసి అమ్మాలనుకున్నారు.అందులో భాగంగా 2022 అక్టోబర్ 19న సాయంత్రం తిమ్మాపూర్ మండల కేంద్రం ప్రాంతంలో ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులకు అమ్మేందుకు వచ్చి వేచి ఉండగా ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్ రెడ్డి పట్టుకోగా వారి వద్ద కిలోన్నర గంజాయి లభించింది. ఈ సంఘటనపై ఎల్ఎండి పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేయగా సిఐ శశిధర్ రెడ్డి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్ వారిని విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నిందితులు ముగ్గురికి జైలు శిక్ష,జరిమానా విధించారు.

మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్‌ప్రధాన నేరస్తులు

పాత కేసులో లొంగుబాటు పిటి వారెంట్ పై తీసుకొస్తాం

అడిషనల్ డీసీపీ వెంకటరమ

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

నగరంలోని భగత్‌నగర్‌లో జరిగిన దోపిడీ కేసులో ఎట్టకేలకు చిక్కుముడి వీడింది. ఈ కేసులో బాధితుని అల్లుడు మనవడే ప్రధాన సూత్రధారిగా బయటపడింది. ఈ దోపిడి కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,09,000 నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను కరీంనగర్ కు తీసుకొచ్చిన సందర్భంగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ మీడియా ముందు హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ నివాసంలో ఈనెల 22న అర్ధరాత్రి సమయంలో దుండగులు డమ్మీ పిస్టళ్లు, కత్తులతో చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలం, నిందితులు పారిపోయిన మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన వారని పోలీసులు నిర్ధారించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టి యూపీ పోలీసుల సహకారం తీసుకున్నారు. కరీంనగర్ నుంచి వెళ్లిన ప్రత్యేక బృందం ట్రాన్సిట్ వారెంట్ పై ముగ్గురు నిందితులను జూలై 29న అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలోసల్మాన్ !! భూరే !! యాదవ్ (22), సల్మాన్ !! విమాన్ (22), మొహమ్మద్ హసీన్ (19) లో ఉన్నారు. వీరి వద్ద నుండిరూ.2,09,000 నగదు,43.67 గ్రాముల బంగారు ఆభరణాలు 64.98 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ సొంత అల్లుడు రజావుద్దీన్ , మనుమడు అజీమ్ రజా ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్ , అజీమ్ రజా కరీంనగర్ పోలీసులు అరెస్టు చేస్తారని భయంతో మీరట్ లో నమోదైన గత కేసుల్లో అక్కడి కోర్టులో లొంగిపోయినట్లు డిసిపి వెంకటరమణ తెలిపారు. ప్రస్తుతం అక్కడి జైల్లో ఉన్న నిందితులను కూడా పిటి వారెంట్ పై తీసుకొస్తామని తెలిపారు.



కరీంనగర్ వార్త

గంజాయి చిక్కుముడి వీడినట్లేనా ?

ఘటన లో తేలాల్సిన బాద్యులు

ఉలిక్కి పడిన చిగురుమామిడి మండలం

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో గత వారం రోజుల కింద ఒక ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణం లో గంజాయి చలామణి ? అనే వార్త దావానంలా మండలంలో వ్యాపించింది. ఈ కేసుకు సంబంధించిన వాస్త, అవాస్తవాలు చూస్తే ఖంగు తినాల్సిందే. ఒక వ్యక్తి మీద ఉన్న పగతో ఎక్కడి నుండో కొంత గంజాయిని తీసుకొచ్చి ఇదే ఆగ్రోస్ ఫర్టిలైజర్ యజమాని దుకాణం లో స్వయంగా ఒక ఈగల్ టీమ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ వేసి



దుకాణం యజమాని అయిన మట్ట శ్రీనివాస్ రెడ్డి ని ఇరికించే ప్రయత్నం లో భాగంగా టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించి పక్కా గా స్కెచ్ వేశాడు సదరు కానిస్టేబుల్ నాగరాజు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆగ్రోస్ ఫర్టిలైజర్ సోదా చేయడం, గంజాయి దొరకడం, దుకాణ యజమాని శ్రీనివాస్ రెడ్డి ని కస్టడీ లోకి తీసుకోవడం క్షణాల్లో జరిగిపోయింది. నేను ఈ నేరం చేయలేదని, ఆ దొరికిన గంజాయి కి నాకు ఎటువంటి సంబంధం లేదని మొదటి నుండే ఆవేదన పోలీసులకు శ్రీనివాస్ రెడ్డి చెబుతూ వచ్చాడు. ఈ కేసులో పోలీసుల విచారణ తీవ్రం కావడం, అసలు దోషిగా, గంజాయి దుకాణం లో పథకం ప్రకారం వేసింది ఈగల్ టీమ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ నాగరాజు అని పోలీసులు తేల్చారు. ఈ కేసులో అసలు ట్విస్ట్ కొండాపూర్ గ్రామానికి చెందిన ఒక మిత్రుడికి సంబందించిన భూవివాదం లో మట్ట శ్రీనివాస్ రెడ్డిని ఇరికించే పథకం లో భాగంగా గంజాయి డ్రామా ఆడారు. కానీ డ్రామాను పోలీసులు చిత్తు చేశారు. గంజాయి వార్తతో చిగురుమామిడి మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.గంజాయి స్లాన్ కి సహకరించిన వారు ఎందరు? ఇట్టి గంజాయి తతంగంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరో పూర్తిగా పోలీసులు తేల్చాల్సి ఉంది. ఇంత సులభంగా గంజాయి ఎలా దొరికింది ? ప్రజలను రక్షి ంచవలసిన ఒక బాధ్యత గల ఈగల్ టీం పోలీస్ కానిస్టేబుల్ ఈ విధంగా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం సిగ్గుచేటు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటలి.

నుస్తులాపూర్ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్యా శ్రీనివాసరావు మొక్కలు నాటారు.గ్రామస్తులకు మొక్కలు పంపిణి చేశారు.మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షి ంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నుస్తులాపూర్ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్యా శ్రీనివాస్ రావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షి ంచాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. మొక్కలు నాటడం వలన మొక్కలు బాగా పెరిగి వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..

ఇల్లందుకుంట, ప్రభాతవార్త:

బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇల్లందుకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం హనుమకొండ లక్ష్మీ నరసింహ, లూమినస్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ మహిళలు ఇంటి పనులకు పరిమితం కాకుండా, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, గర్భసంచికి సంబంధించిన ఇబ్బందులు, ప్రెగ్నెన్సీ కి సంబంధించిన జాగ్రత్తల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. కారోబర్ తిప్పారపు వీరన్న మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు ఎదుర్కొంటున్న మానసిక, శారీరక రుగ్మతల గురించి చాలా శ్రద్ధగా వివరించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చి అవసరమున్నవారికి షుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమ్య మాట్లాడుతూ వైద్య చికిత్స కోసం ఆసుపత్రులకు వెళ్లలేక సతమతమయ్యే సామాన్య ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయని ఇల్లంతకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామ సర్పంచ్ గుత్తికొండ రమ్య రవికుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ తీసుకోవలసిన మోతాదులో మంచినీరు తీసుకోవాలని మంచినీరు తీసుకోకపోవడం వల్ల కూడా అనేక రుగ్మతలు వస్తున్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్లు సుమలత, స్వాతి, ఆసియా, వైద్యులు సంకీర్తన, పిఆర్వో బిక్షపతి, సంపత్ రెడ్డి, రాజేష్, సిబ్బంది ప్రసన్న, భారతి, కృష్ణవేణి, గ్రామ ఉపసర్పంచ్ ఇంగ్లే లక్ష్మయ్య, కార్యదర్శి సుమలత, వార్డు మెంబర్లు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ గొడుగు మానస లతో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జమ్మికుంటలో ఘనంగా శ్రీ మడేలేశ్వరస్వామి బోనాల పండుగ వేడుకలు.....

శ్రీమడేలేశ్వరస్వామి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి.....

మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)..

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

శ్రీ మడేలేశ్వర స్వామి దీవెనలతో జమ్మికుంట పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అన్నారు.జమ్మికుంట పట్టణంలో శుక్రవారం శ్రీ మడేలేశ్వర స్వామి



బోనాల పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.శ్రీ మడేలేశ్వరస్వామి వారి బోనాల పండుగ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ శ్రీ మడేలేశ్వర స్వామి వారి ఆశీర్వాదంతో పట్టణ ప్రజలందరూ పాడి పంటలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖశాంతులతో ఉండాలని కోరారు. అలాగే స్వామి వారి దేవాలయంలో కొంత మరమ్మతులు మిగిలి ఉన్నవని రజక సంఘం సోదరులు తెలపడం జరిగిందని అలాగే స్వామి వారి కృపాకటాక్షాలతో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు వరంగంటి సదానందం, బూరుగుపల్లి రాము,తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ కు పదవి విరమణ వీడ్కోలు.....

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేసి శుక్రవారం పదవి విరమణ పొందిన కొల్ల రాజిరెడ్డి కి కళాశాల అధ్యాపకులు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశములో అధ్యాపకులు మాట్లాడుతూ రాజిరెడ్డి నిరాడంబర వ్యక్తిత్వం,క్రమశిక్షణ,విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత,సహోద్యోగులతో సత్సంబంధాలు, కళాశాల విద్యా భివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు.దీనికి ముందు ఆయనను అధ్యాపకులు శాలువాలతో ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేశారు. ఈ కార్య క్రమంలో అధ్యాకులు రవీందర్,గ్రంథ పాలకుడు రామ్మోహన్, కత్తెరశాల, జైపాల్ రెడ్డి, శోభన్ బాబు, కల్పన,కరుణ, సుమలత, స్వప్న, శైలజ,తాజుద్దీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాం స్టిచ్చింగ్ లో మెలుకువలను వివరించిన మెప్మా పీడీ...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

జమ్మికుంట మెప్మా సంఘ సభ్యులు స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ చేయు కేంద్రాలను మెప్మా పిడి స్వరూప రాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం స్కూల్ యూనిఫాం కుట్టే కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. టైలర్ లకు పలు సూచనలు చేస్తూ యూనిఫాం కుట్టే ప్రతి టైలర్ 12 అంశాలైన సూత్రాలను దృష్టిలో పెట్టుకొని పిల్లలకు నాణ్యతగా యూనిఫాం



కుట్టి అందించాలన్నారు. నేడు వెల్చేర్ పాఠశాలలో యూనిఫాం అందించాలని, ఆగష్టు నెల 10వ తేదీ వరకు స్కూల్ పిల్లలకు యూనిఫామ్ లు ఇవ్వాలని పీడీ ఆదేశించారు. పీడీ స్వయంగా స్టిచ్చింగ్ చేసి స్టిచ్చింగ్ మెలుకువలు తెలిపారు. ఆర్పి, ఓబిల రివ్యూ సమావేశానికి మెప్మా పిడి స్వరూప రాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిడి స్వరూప రాణి బి.ఎల్. వో వర్క్ లేని ఆర్పిలు, ఓబిలతో మెప్మా కార్యక్రమాలు బ్యాంక్ లింకేజ్, కొత్త సంఘాల ఏర్పాటు, చీరల పంపిణీ, సంఘ సభ్యుల ఆధార్ సీడింగ్ వంటి అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించగా వారం రోజుల వ్యవధిలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ఆర్పిలు తెలిపారు.మళ్ళీ నిర్వహించే ప్రత్యేక సమావేశం వరకు పెండింగ్ లో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని ఆర్పిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెప్మా డి.ఏం.సి శ్రీవాణి, టి.ఎల్.ఎఫ్. ఓబీలు గీత, జ్యోతి, సి ఎల్.ఆర్పిలు జ్యోతి, మంజుల, అర్పిలు విజయ, అభేదభాను, మాలతి, సంధ్య, ఉమ, శిరీష, శ్రీదేవి, శ్రీలతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

వీణవంక మండలములో కురుస్తున్న వర్షాలు....

చెరువులు,కుంటలకు జలకళ.

వీణవంక, ప్రభాత వార్త:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులు కురుస్తున్న మోస్తారు వర్షాలతో వీణవంక మండలము లోనీ 20 గ్రామాల్లో సుమారు చెరువులు,కుంటలు జల కళను సంతరించుకోగా,దీంతో బావులలో భూగర్భ జలాల నీటి మట్టం పెరగడంతో,గత వారం రోజుల క్రితం ఎల్ నినో ప్రభావం తో చెరువులు,కుంటల్లో నీరు లేక పోవడం తద్వారా బావులలో వరి పంటలకు సరిపడ నీరు లేక ఆందోళన చెందిన రైతులు,మోస్తారు వర్షాలతో రైతులు పూర్తి స్థాయి లో భూములను సాగుకు సిద్ధం చెస్తున్నారు. మండలములో మానేరు సమీప గ్రామాల మానేరు పొంగి పోతుండడం,అదేవిధంగా ఎస్సారెస్పీ నిండడం తో కాల్వల ద్వారా పంటలకు నీరు అంతుందని,దీంతో ఈ ఖరీఫ్ సీజన్ పంటకు డోకా లేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





విద్యారంగంలో.. నాలుగు దశబ్దాల ఆయన సేవలు.. మరవలేనివి..

పూర్వ విద్యార్థులు.. ప్రజాప్రతినిధులు..

జమ్మికుంట/ హుజూరాబాద్ , ప్రభాతవార్త:

భారతదేశ భవితవ్యం నాలుగు గోడల మధ్యనే నిర్మించబడుతుందన్న నగ్నసత్యానికి నాలుగు దశబ్దాల పాటు విద్యారంగంలో తనవంతు బాధ్యతలను వృత్తిని దైవంగా భావించి వేలాది మంది విద్యార్థులకు విద్యారంగంలో ఊపిరిపోసి విశిష్ట సేవలు అందించిన జమ్మికుంట బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామెర సుధాకర్ శుక్రవారం పదవి విరమణ



సందర్భంగా పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. జమ్మికుంట బాలికల పాఠశాలలో పలు ప్రభుత్వ పాఠశాలలో గతంలో పనిచేసి జమ్మికుంట మండల ఇంచార్జి మండల విద్యాధికారిగా సంవత్సరాల పాటు పనిచేసి విద్యారంగాన్ని ఒక చక్కటి క్రమశిక్షణలో పెట్టిన ఘనత దామెర సుధాకర్‌కు దక్కుతుందని మాజీ ఎంపిటిసి వాసాల రామస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు సుంకరి యాదయ్య, పంతాటి రవీందర్‌లు కొనియాడారు. నాలుగు దశాబ్దాల కాలంలో వేలాది మంది విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దిన దామెర సుధాకర్ ఉపాధ్యాయ లోకానికి ఆదర్శమని అన్నారు. చక్కటి క్రమశిక్షణ కల్గిన ఉపాధ్యాయునిగా నిత్యం తన వృత్తిని దైవంగా భావించి సామాజిక బాధ్యతతో 40 వసంతాలు విద్యారంగంలో సేవలు అందించిన దామెర సుధాకర్, ఆయన సతీమణిని పాఠశాల ఆవరణలో ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఏ రషీద్, కొంగల కుమార్, మారపెల్లి అజయ్‌లు పాల్గొని ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు ముంపు ప్రాంతాన్ని రక్షించండి అంటూ.. మున్సిపల్ చైర్మన్‌కు మొర..

సర్వసభ్య సమావేశంలో 38 అంశాలు ఏకగ్రీవ తీర్మాణం..

జమ్మికుంట/ హుజూరాబాద్ , ప్రభాతవార్త:

వర్షాలు కురుస్తున్నాయి.. వరదలు ముంచుకొస్తున్నాయి మహాప్రభో.. హౌసింగ్ బోర్డు ముంపు ప్రాంతాన్ని కాపాడండి.. 200 కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారంటూ కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో శుక్రవారం వార్డు కౌన్సిలర్ శ్రీపతి సర్జలత నరేష్ మున్సిపల్ చైర్మన్‌కు మొరపెట్టుకున్నారు. హౌసింగ్ బోర్డు, అంబేద్కర్ కాలనీ, కృష్ణకాలనీ, పలు లోతట్టు ప్రాంతాలు జమ్మికుంట పట్టణంలో గత 12 సంవత్సరాలుగా ఎన్నికల నినాదంగా మిగిలిపోయాయని ఇప్పటికే పలుమార్లు కాలనీ ప్రజలు వరద నీటిలో మునిగిపోయి సర్వం కోల్పోయారని ఇప్పటికైన మున్సిపాలిటీ నుండి ప్రత్యేక నిధులు కేటాయించి, వరద కాల్వ నిర్మించి ప్రజలను కాపాడాలంటూ కౌన్సిలర్ స్వర్జలత నరేష్ సమావేశంలో మొరపెట్టుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన జరిగిన సమావేశానికి మున్సిపల్ కమీషనర్ మల్లిఖార్జున్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు హాజరైయ్యారు. మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు, లికేజీ వాటర్ పనులకు, వాహనాల మరమ్మత్తుల కోసం, జనరేటర్ మరమ్మత్తుల కోసం, సిసి కెమెరాలు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు కోసం, ఫోన్ కనెక్షన్స్‌లతో పాటు స్థానిక గాంధీచౌక్ పథకం జెండా పునఃరుద్ధరించేందుకు 38 అంశాలను యుద్ద ప్రాతిపదికన చేపట్టేందుకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా, అందులో పేర్కొన్న 38 అంశాలను ఏకగ్రీవంగా తీర్మాణం చేసారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ముంతాజ్ అలీ (జావిద్),



మున్సిపల్ కౌన్సిలర్లు, మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ వికాస్, జెఎఓ రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో సోక్‌పిట్ నిర్మించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పట్టణ పరిపాలనపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో సోక్‌పిట్ నిర్మించాలి అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణ శ్రీ తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని, ఇంకుడు గుంత లేని ఇళ్లకు ఇంటి నంబర్, తాగునీటి నల్లా కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇప్పటికే నిర్మించబడిన ఇళ్లలో కూడా వీలైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డు పరిధిలో వచ్చే నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా వార్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. రహదారులపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలని, ప్రజారోగ్యానికి భంగం కలిగించే పరిస్థితులు ఎక్కడా తలెత్తకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

పెద్దపల్లి అదనపు కలెక్టర్ బి శ్రీరాములు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని పెద్దపల్లి అదనపు కలెక్టర్ బి శ్రీరాములు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ సమావేశానికి పెద్దపల్లి అదనపు కలెక్టర్ బి శ్రీరాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అలవర్చుకుంటూ మన చుట్టూ ఉన్న ఎవరూ మత్తు పదార్థాల బారిన పడకుండా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు లేదా చెడు అలవాట్లకు బానిస కాకూడదని హితవు పలికారు. ఒక్కసారి మత్తుకు బానిసైతే వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో డ్రగ్స్ విక్రయం, కొనుగోలు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచే చర్యలు చేపట్టాలని సూచిం చారు. డ్రగ్స్ విక్రయం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పోలీసు, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ అధికారులతో పాటు వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు వెంటనే పరిష్కారం

భూ రీసర్వే ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశం

కుటుంబ రిజిస్టర్ ధ్రువపత్రాల జారీలో నిబంధనలు పాటించాలి

ఎల్లంపల్లి వరద పరిస్థితులపై అధికారులకు అప్రమత్తత సూచన

ప్రాజెక్టు వద్ద నీటి విడుదల, దిగువ ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక

గోదావరిఖని,ప్రభాత వార్త:



జిల్లాలో ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అంతర్గాం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ పనితీరును సమీక్షించిన ఆయన, అనంతరం శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించి వరద పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని సూచించారు. మీ సేవ ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో కుటుంబ రిజిస్టర్ ధ్రువపత్రాలకు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్న శ్రీరాములు, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే వాటిని జారీ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే ధ్రువపత్రాలు అందించాలని సూచించారు.అనంతరం యెల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన అదనపు కలెక్టర్ నీటి మట్టం, నిల్వ, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాల దృష్ట్యా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయడంతో పాటు నది పరివాహక ప్రాంతాల్లో చేపల వేటకు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.జూలై 31 మధ్యాహ్నం 3 గంటల నాటికి యెల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం 147.46 మీటర్లుగా నమోదైంది. ప్రాజెక్టులో 18.6750 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, 88,705 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 96,428 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. మొత్తం 62 గేట్లలో 15 గేట్లను ఎత్తి 80,370 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు.ఈ పర్యటనలో అంతర్గాం తహసీల్దార్, యెల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐసెట్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

3 నుంచి 5 వరకు తొలి విడత కౌన్సెలింగ్

గోదావరిఖని, ప్రభాతవార్త:స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం టీజీ ఐసెట్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇనుగాల మనోహర్ తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆగస్టు 3 నుంచి 5 వరకు తొలి విడత ఐసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.విద్యార్థులు ముందుగా స్లాట్ బుక్ చేసుకుని నిర్ణయించిన తేదీ, సమయానికి అవసరమైన ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యూనివర్సిటీ పీజీ కళాశాలలో గతంలో ఇంజినీరింగ్, డిప్లొమా కోర్సుల ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించగా, ఈ ఏడాది తొలిసారిగా టీజీ ఐసెట్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం విశేషమన్నారు. దీంతో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం స్థానిక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే కౌన్సెలింగ్ సేవలు పొందే అవకాశం కలిగిందని తెలిపారు.

పెద్దపల్లి వార్త

ఘనంగా వనమహోత్సవం

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సర్పంచ్ మేకల లావణ్య జనార్దన్ రెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం 'వన మహోత్సవ' కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో నింపాలనే సంకల్పంతో పాలకవర్గం తో పాటు గ్రామస్తుల సహకారంతో సొంత ఖర్చులతో సుమారు 30 వేల విలువగల 300 పండ్ల మొక్కలను కొనుగోలు చేశామన్నారు . కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు. మొక్కలు రక్షించేందుకు టీ గడ్డ కోసం గ్రామానికి చెందిన గణపతి రెడ్డి 3000 రూపాయలు సహాయం అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలి. గ్రామాభివృద్ధికి,పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. లక్ష్మీపూర్ సర్పంచ్ మేకల లావణ్య జనార్దన్ రెడ్డి పాలకవర్గం సొంత ఖర్చులతో ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. పలువురు సర్పంచులు లక్ష్మీపూర్ గ్రామం పాలకవర్గం ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామాల్లో అదేవిధంగా మొక్కలు నాటాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జింగిలి తిరుపతి, శ్రీరాంపూర్ సర్పంచ్ బంగారి రమేష్ మాజీ సర్పంచ్లు మాదాసి సతీష్, శంకర్ వార్డు సభ్యులు పచ్చిక రజిత మల్లేష్, బోయిన చందర్, బోయిన పుల ఐలయ్య, బొమ్మిరెడ్డి చంద్రకళ సదయ్య, కొన్ని అశోక్ సుజాత స్వామి , నాయకులు నరసింహారెడ్డి వీరేశం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణకు ఎమ్మెల్యే ముందుకు రావాలి

బిజెపి నేత సురేష్ రెడ్డి

సుల్తానాబాద్,ప్రభాతవార్త:పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ ధాన్యం తరలింపులో భారీ అవకతవకలు జరిగాయని బీజేపీ నేత సురేష్ రెడ్డి మరోసారి ఆరోపించారు. రైతులను నష్టపరిచి కొందరు రైస్ మిల్లర్లు, అధికారులు కలిసి వందల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ధాన్యం కొనుగోళ్లలో రూ.700 కోట్ల మేర అక్రమాలు జరిగాయని గతంలో వెల్లడించిన అంశాలపై ఇప్పటికీ సమాధానం రాలేదన్నారు.ధాన్యం కొనుగోళ్లలో అదనపు తూకాలు వేసి రైతులను మోసం చేశారని, దీనికి సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలు తన వద్ద ఉన్నాయని సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే పెద్దపల్లి నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోళ్లు, రైస్ మిల్లుల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వాన్ని కోరాలని సవాల్ విసిరారు.అవినీతి అంశాలపై తాను సేకరించిన ఆధారాలను త్వరలోనే సీబీఐ, ఈడీ అధికారులకు అందజేస్తానని, పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు రైతుల తరఫున పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు రైతుల మధ్యకు వచ్చి అదనపు తూకాలు వేయలేదని నిరూపించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. రైతుల సమస్యల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే మరిన్ని ఆధారాలను దశలవారీగా ప్రజల ముందుకు తీసుకొస్తానని హెచ్చరించారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, బండారి లత, ఎర్రం సంతోష్ రెడ్డి, మల్క భాగ్యలక్ష్మి, వలస సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కల్లెడలో ఎస్సారెస్పీ కాలువ పూడ్చివేతపై నిరసనలు

స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి






జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ కల్లెడ గ్రామంలో నీటిపారుదల కాలువ ఆక్రమణ కారణంగా బాటసారులు, గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్న ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఎస్సారెస్పీ పరిధిలోని పొట్రినారు కాలువను నిబంధనలకు విరుద్ధంగా పూడ్చివేసి, దాని స్థానంలో చిన్నపాటి సిమెంట్ పైపులను అమర్చడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. సాధారణంగా సమృద్ధిగా వర్షాలు కురిసిన వేళ కాలువ గుండా సాఫీగా సాగిపోవాల్సిన వర్షపు నీరు,ప్రవాహానికి తగినంత మార్గం లేకపోవడంతో పూర్తిగా నిలిచిపోయి రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీనివల్ల నిత్యం ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రహదారిపై భారీగా నీరు చేరడంతో వాహ నాలు నిలిచిపోవడం, ప్రమాదాలు సంభవించే అవకాశం పెరగడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఎస్సారెస్పీ కాలువల నిర్మాణం కోసం ప్రభుత్వం నిబంధనల ప్రకారం భూములను సేకరించి, సంబంధిత భూమి యజమానులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన విషయాన్ని ఈ సందర్భంగా స్థానికులు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి తగిన పరిహారం చెల్లింపులు జరిగినప్పటికీ,ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కాలువను ఈ విధంగా పూడ్చివేయడం,రహదారి భద్రతను ప్రమాదంలో పడేయడం ఏమాత్రం తగదని,నిబంధనల ఉల్లంఘన వల్ల ఊరంతా, రాకపోకలు సాగించే ఇతర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి రావడం శోచనీయమని వాపోతున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై సమాచారం అందుకున్న ఎస్సారెస్పీ అధికారులు ఇప్పటికే సదరు వ్యక్తికి పలుమార్లు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.ప్రభుత్వ ఆస్తి అయిన కాలువను ఆక్రమించడం,ప్రవాహానికి అడ్డంకులు సృష్టించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పు రాక పోవడం గమనార్హం. ప్రస్తుత పరిస్థితుల్లో నిలిచిపోయిన వర్షపు నీటి కారణంగా రహదారి తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది.దీనివల్ల ప్రయాణికుల రవాణా సౌకర్యాలకు విఘాతం కలగడమే కాకుండా,స్థానిక ప్రజల రోజువారీ కార్యకలాపాలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి ఆక్రమణలను తక్షణమే అడ్డుకోవాలని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా కాలువను పాత పద్ధతిలోనే పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత యంత్రాంగం త్వరితగతిన స్పందించి,ప్రవాహ మార్గాన్ని సరిచేసి రహదారిపై నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదపు అంచుల్లో కండ్లపల్లి చెరువు కట్ట

భారీ వర్షం ఆలు పడితే తెగనున్న కట్ట

అధికారులు పరిశీలించాలని రైతులు, మత్స్యకారులు వేడుకోలు







జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: కండ్లపల్లి పెద్ద చెరువు కట్ట నిరంతర నీటి ఉధృతికి దెబ్బతింటూ కుంగుతుండటం స్థానిక లోతట్టు ప్రాంతాల రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.గత కొద్ది రోజులుగా వరుసగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. నీటి ప్రవాహ వేగం పెరగడంతో కట్ట ఒండ్రు మట్టి కొట్టుకు పోయి కొంత భాగం పగుళ్లుబారి కుంగిపోతున్నట్లు స్థానికులు గమనించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇప్పుడే పొలాలను దున్నుతున్న,వరి నాట్లుకు సిద్ధమవుతున్న ఆయకట్టు రైతులు తీవ్ర భయాందోళనల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. నాట్లు వేసే సమయానికి కట్ట తెగిపోతే అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు మట్టిపాలవుతాయని,పొలాలు ఇసుక మేటలుగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏటా వర్షాకాలంలో చెరువు కట్ట బలహీనపడిన ప్రతిసారీ సంబంధిత యంత్రాంగం తాత్కాలిక ఉపశమన చర్యలకే పరిమితమవు తోందని రైతాంగం ఆరోపిస్తోంది. ప్రమాద సంకేతాలు కనిపించగానే మట్టి బస్తాలు, ఇసుక సంచులు తెచ్చి అడ్డుగా వేయడం తప్ప, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వర్షాల ఉధృతి పెరిగినప్పుడు ఈ తాత్కాలిక మట్టి బస్తాలు వరద ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయని,ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని వారు పేర్కొంటున్నారు.ధనం వెచ్చించి నాట్లు వేసుకుంటున్న తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కట్టను రాతి గోడలతో బలోపేతం చేసి,శాశ్వత ప్రాతిపదికన పటిష్ట పరిచే పనులు చేపట్టాలని కోరుతున్నారు. కండ్లపల్లి పెద్ద చెరువు కట్ట సురక్షితంగా ఉంటేనే సమీప గ్రామాల లోతట్టు పొలాలకు రక్షణ ఉంటుందని, కట్ట రూపురేఖలు మారేలా శాశ్వత డిజైన్‌తో నిర్మిస్తేనే సమస్య ముగుస్తుందని ఆయకట్టుదారులు స్పష్టం చేస్తున్నారు. ప్రతిసారీ తాత్కాలిక ప్యాచ్ వర్కులతో కాలయాపన చేయడం వల్ల ప్రభుత్వ ధనం వృథా అవ్వడమే కాకుండా రైతుల గుండెల్లో భయం నీడలా వెంటాడుతోందని ఆవేదన చెందుతున్నారు.ఇకనైనా తాత్కాలిక పనులతో సరిపెట్టకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కట్టను శాశ్వతంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.సంబంధిత శాఖల ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కండ్లపల్లి చెరువు కట్టను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.వరి నాట్లు పూర్తయ్యేలోగా శాశ్వత నిధులు మంజూరు చేసి,కట్ట మరమ్మతు పనులను పటిష్టంగా పూర్తి చేయాలని విన్నవిస్తున్నారు.అధికారుల తక్షణ స్పందనే తమ పంటలకు,గ్రామ లోతట్టు ప్రాంతాలకు రక్షణ కల్పిస్తుందని ఆశిస్తూ,చెరువు కట్ట రక్షణ కోసం రైతాంగం అధికారులను వేడుకుంటోంది.

సర్ ఆన్లైన్ మ్యాపింగ్ లో తీవ్ర లోపాలు

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు లేఖ రాసిన

మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ రఘు



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల పట్టణంలో జరుగుతున్న "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్"ఓటర్ల దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియలో తీవ్ర లోపాలు చోటుచేసుకుంటున్నాయని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు లేఖ రాశారు .బి.ఎల్.ఓ ల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకొని నింపి ఇచ్చినప్పటికీ అవి ఆన్‌లైన్ కాకపోవడం,పలు అప్లికేషన్లు మిస్ అవ్వడంతో అధికారులు మళ్లీ దరఖాస్తులు అడుగుతున్నారని, దీనివల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు జిరాక్స్ ఉంచుకోకపోవడం వల్ల,తిరిగి 2002 నాటి వివరాలను సేకరించడం ఓటర్లకు కష్టంగా మారిందన్నారు.అవగాహన రాహిత్యంతో ఆన్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియను సరిగ్గా చేపట్టకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణమని జయశ్రీ విమర్శించారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లను వారి పరిధిలోని బూత్‌లలో కాకుండా వేరే గ్రామాలు,పట్టణాల బి.ఎల్.ఓల వద్ద తప్పుగా మ్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు.ఈ పొర పాట్లను సరిచేయాలని వేరే ప్రాంత బి.ఎల్.ఓలకు ఫోన్ చేసి కోరినా స్పందించడం లేదని, ఫలితంగా స్థానిక బి.ఎల్.ఓల వద్ద మ్యాపింగ్ కాక ఓటర్ల అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. సమయం దగ్గర పడుతుండటంతో జిల్లా కలెక్టర్ స్పందించి,ఓటర్ల దరఖాస్తులన్నీ సక్రమంగా ఆన్‌లైన్ అయ్యేలా చూస్తూ, కుటుంబాల వారీగా వారి పరిధిలోని పోలింగ్ బూత్‌లలోనే మ్యాపింగ్ జరిగేలా బి.ఎల్.ఓలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



పదవి విరమణ పొందిన ఏఎస్ఐ ఆనందంకు సన్మానం

మల్యాల, ప్రభాతవార్త



మల్యాల సర్కిల్ స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ ఆనందం శుక్రవారం పదవి విరమణ పొందారు, ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ లో జరిగిన కార్యక్రమంలో పదవి విరమణ పొందిన ఏఎస్ఐ ఆనందం కు ప్రత్యేక పోలీసు వాహనంలో బ్యాండ్ తో వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ ఎస్ బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు,

కూల్చివేతలు కాదు... నిర్మాణాలు చేపట్టాలి

పాలనలో అభివృద్ధి కంటే విధ్వంసమే కనిపిస్తోంది.

బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి

గోదావరిఖని, ప్రభాతవార్త: రామగుండం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన సమయంలో కూల్చివేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, స్థానిక ఎమ్మెల్యే ఎన్నికై మూడేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు కనిపించడం లేదని, కూల్చివేతలే కనిపిస్తున్నాయని విమర్శించారు. తిలక్‌నగర్‌లోని దుకాణాల తొలగింపు అంశంపై ఆమె స్పందిస్తూ.. దుకాణాలను కూల్చివేసి, లబ్ధిదారుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి కొత్త నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇప్పటికీ పనులు పూర్తిస్థాయిలో జరగలేదని అన్నారు. నిర్మాణాల్లో జాప్యం ఎందుకు జరుగుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సింగరేణి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారా? తిలక్‌నగర్‌లో చేపట్టిన నిర్మాణాలను తాజాగా సింగరేణి అధికారులు వచ్చి తొలగించడం పలు అనుమానాలకు తావిస్తోందని సంధ్యారాణి అన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులు, ప్రభుత్వ నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అధికారులను తప్పుదోవ పట్టించి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.ప్రజల ఉపాధిని దెబ్బతీస్తున్నారుదుకాణాల తొలగింపుతో వందలాది కుటుంబాల జీవనాధారం దెబ్బతింటోందని ఆమె అన్నారు. ప్రజల జీవితాలపై బాధ్యత లేకుండా వ్యవహరించడం సరికాదని, కేవలం భవనాలను కూల్చడం పరిపాలన కాదని విమర్శించారు."కూల్చేది కేవలం భవనాలు కాదు... ప్రజల నమ్మకం" అని వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రామగుండంలో కాంగ్రెస్ పార్టీ పునాదులే కదిలిపోతాయని హెచ్చరించారు.ప్రజలు ప్రశ్నించాలిరామగుండం ప్రజలు చైతన్యవంతులై సమస్యలపై ప్రశ్నించాలని సంధ్యారాణి పిలుపునిచ్చారు. రెండు నుంచి మూడు వేల కుటుంబాలు ఇబ్బందుల్లో పడుతున్నా మౌనంగా ఉండటం సరికాదన్నారు. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు.ఎమ్మెల్యే సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, వారి జీవితాలతో ఆటలాడే విధానాలకు స్వస్తి పలకాలని సూచించారు. బాధితులకు వెంటనే న్యాయం చేసి, హామీ ఇచ్చిన నిర్మాణాలను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సులువ లక్ష్మీనరసయ్య, మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య, జక్కుల పద్మ, బూడిద హర్ష, ఆకునూరి తిరుమల, వీరబోయిన శ్రీనివాస్, కుర్ర రాజేందర్, పంగ రవి, జక్కుల ప్రవీణ్, కొట్టే నరేష్, హనుమాన్ల వెంకటేష్, మీన వికాస్ తదితరులు పాల్గొన్నారు.

తారుకు గుంత..ప్రయాణికుల చింత

మరిమడ్ల-గర్జనపల్లి గ్రామాల రాకపోకలకు ఇక్కట్లు
వర్షం దాటికి కొట్టుకపోయిన రోడ్డు
మరమ్మతులు చేపట్టాలంటున్న ప్రయాణికులు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తారు రోడ్డుకు గుంతపడి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కోనరావుపేట మండలం మరిమడ్ల గర్జనపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారికి గుంతపాడడంతో రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం నీటి ఉధృతికి తారు రోడ్డు సగం వరకు కొట్టుకుపోయింది. గతంలో ఈ రెండు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల మేర వేసిన తారు రోడ్డు కు నాణ్యత ప్రమాణాలు కాంట్రాక్టర్ పాటించకపోవడంతోని చిన్నపాటి వర్షానికి గుంత



పడి ప్రయాణికులు వెళ్లేందుకు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నాయకులు శ్రీనివాస్ వార్డు సభ్యులు కుమ్మరి దిలీప్ కుమార్,కొండం రమేష్, జింక రాజేందర్. కొమ్ము రాజేశంలు కోరారు.

పోలీసుల ఆధ్వర్యంలో శ్రమదానం

చందుర్తి / ప్రభాతవార్త

చందుర్తి మండల కేంద్రం నుండి మల్యాల గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను శ్రమదానంతో ట్రాక్టర్ తో శుక్రవారం పోలీసులు తొలగించారు . ఈ సందర్భంగా సిఐ రవీందర్ మాట్లాడుతూ చందుర్తి నుండి మల్యాల వెళ్లే దారిలో మూల మలుపుల వద్ద కారు బోల్తాపడడంతో పాటు ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రమాదాల నివారణకై రోడ్డుకి ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగింప చేయడం జరిగిందన్నారు.మూల మలుపుల వద్ద వేగంగా వెళ్లడం చాలా ప్రమాదకరమని. నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. వేగం వలన వాహనం అదుపు తప్పడానికి ఎదురుగా వచ్చే వాహనాలతో



ఢీకొనడానికి దారితీస్తుందన్నారు. రోడ్డు భద్రతా నియమాల ప్రకారం, మలుపుల వద్ద ఎప్పుడూ వేగాన్ని తగ్గించాలన్నారు. మలుపుల వద్ద అవసరమైనప్పుడు హార్న్ ఉపయోగించి మీ రాకను ఇతరులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలకు ఇల్లు కూలిన ఘటన బాధిత
కుటుంబాన్ని పరామర్శించిన గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్
ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని గ్రామస్థుల విజ్ఞప్తి

బోయిన్ పల్లి,ప్రభాత వార్త



గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన మల్యాల శంకరయ్య నివాస గృహం కూలిపోయింది,ఈ ఘటనలో ఇంటి పైకప్పు పూర్తిగా ధ్వంసమై,ఇంట్లోని సామగ్రి దెబ్బతింది,అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు, సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య,ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు,ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి,బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు గృహ నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని అందించాలని గ్రామస్థులు కోరారు.

పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళులు

చందుర్తి / ప్రభాతవార్త

తెలంగాణ ఉద్యమకారుడు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల చందుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్. మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన పోరాటాలు మరువలేదే అన్నారు. సుదర్శన్ రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య నాయకులు బత్తుల కమలాకర్. రవి. అజయ్ తదితరులు పాల్గొన్నారు.



వర్షం పడితే... పైలం!

పిడుగులు, విద్యుత్ ప్రమాదాలు, విషజంతువుల పట్ల
అప్రమత్తంగా ఉండాలి

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరుతున్నారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టులపై ప్రవహిస్తున్న వరద నీటిని దాటే ప్రయత్నం చేయకూడదని, వరద నీటిలో సెల్ఫీలు తీయడం, ఈతకు దిగడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. తల్లిదండ్రులు చిన్నారులను వరద ప్రాంతాలకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు వాతావరణ సూచనలను గమనిస్తూ పొలాలకు వెళ్లాలని, ఉరుములు, మెరుపులు ప్రారంభమైన వెంటనే చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప కంచెల సమీపంలో నిలబడకుండా సురక్షి త ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. పిడుగులు పడే సమయంలో పొలాల్లో వ్యవసాయ పనులను నిలిపివేసి సురక్షి తమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.భారీ వర్షాల కారణంగా పాములు, తేళ్లు వంటి విషజంతువులు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తకుప్పలు, పొదలను తొలగించాలని తెలిపారు. రాత్రివేళల్లో టార్చ్‌లైట్ లేకుండా బయటకు వెళ్లకూడదని, పాము కాటుకు గురైతే మూఢనమ్మకాలను నమ్మకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.విద్యుత్ తీగలు తెగి కనిపించినా లేదా విద్యుత్ స్తంభాలు వంగి ఉన్నా వాటి సమీపానికి వెళ్లకుండా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వర్షాల సమయంలో తడిసిన విద్యుత్ పరికరాలను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వర్షాకాలంలో చిన్నపాటి నిరక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయొచ్చు. "వర్షం పడితే... పైలం!" అనే భావనతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే పిడుగులు, విద్యుత్, వరదలు, విషజంతువుల వల్ల సంభవించే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని అధికారులు పేర్కొన్నారు.



వేములవాడ వార్త

మనువాడ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్

బోయిన్ పల్లి,ప్రభాత వార్త



మనువాడ గ్రామ ప్రజల తరపున రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ,ఆర్డీఓ ఆర్‌డీఓని మర్యాదపూర్వకంగా కలిసి, మాను వాడ గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్ గ్రామానికి సంబంధించిన ప్యాకేజ్ పెండింగ్ సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్లారు.ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టి, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించి విజ్ఞప్తి చేశారు.అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమగ్రంగా చర్చించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన పరిపాలనా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. గ్రామ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.మనువాడ గ్రామ ప్రజలకు న్యాయం జరిగే వరకు మా ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయి. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాను వాడ గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

గుంతల మయంగా మారిన బోయిన్‌పల్లి గర్షకుర్తి రహదారి

పట్టించుకొని ప్రజాప్రతినిధులు ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

బోయిన్ పల్లి,ప్రభాత వార్త:



బోయిన్ పల్లి మండల కేంద్రం నుండి గర్షకుర్తి వెళ్ళు రహదారి పూర్తిస్థాయిలో అధ్వానంగా తయారై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో రహదారికి ఎటువంటి మోక్షం లేకుండా పోయింది. అధ్వానంగా గుంతల మయంగా మారిన రహ దారిని వెంటనే బాగు చేసి నూతన రోడ్డు వేయాలని పలువురు బోయిన్ పల్లి మండల వాసులు తీవ్ర ఆవేదనతో కోరుతున్నారు.

శ్రీ రాజరాజేశ్వర జలాశయంలోకి భారీగా వచ్చి చేరుతున్న నీళ్లు

బోయిన్‌పల్లి,ప్రభాత వార్త:

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మాను వాడలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేర్) లోకి భారీగా ఇన్ ఫ్లో నీళ్ళు వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం డ్యాంలో 17,242 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో ఉండగా ఎల్లంపల్లి నుండి 12,600 క్యూసెక్కులు, మూలవాగు మరియు మానేరువాగుల నుండి ప్రాజెక్టుకు 4,642 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుందని, ప్రాజెక్ట్ నీటిమట్టం 318 మీటర్లకు గాను 308.21 మీటర్లకు చేరుకుంది. పూర్తిస్థాయి 27. 55 టీఎంసీలకు గాను గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో ప్రస్తుతం 8.858 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

రామగిరి ఖిల్లాలో 250 ఎకరాలలో ఇండస్ట్రీయల్ పార్కు

త్వరలో బహుళ జాతి పారిశ్రామికవేత్తలతో
మంత్రి శ్రీధర్ బాబు పర్యటన
ఖిల్లా రహదారి పనులపైనా దృష్టి పర్యటనకు అధికారుల ఏర్పాట్లు

రామగిరి ప్రభాతవార్త:

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన కు రంగం సిద్ధమైంది. త్వరలో మేడిపల్లి శివారులోని రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఇండస్ట్రీయల్ పార్క్‌కు కేటాయించిన భూములను ఆయన పరిశీలించనున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని మేడిపల్లి ప్రాంతంలో సుమారు 250 ఎకరాలలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కు సంబంధించిన పనులను మంత్రి పరిశీలించనున్నారు. ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిస్థితులు, మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో అధికారులతో మంత్రి సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రత్నాపూర్ గ్రామం నుంచి ఖిల్లా ప్రాంతానికి వెళ్లే రహదారి పనుల పురోగతిని కూడా మంత్రి పరిశీలించనున్నారు.మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు శుక్రవారం ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ ఆధ్వర్యంలో పరిశ్రమలు



ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో చదును చేసే పనులుచేపట్టారు.ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు ద్వారా రత్నాపూర్, రామగిరి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని స్థానికులు భావిస్తున్నారు. పరిశ్రమలు అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేశారు. తహసీల్దార్ పర్నంది సుమన్,ఎంపిడీఓ బద్రి శైలజ రాణి,ఎంపీఓ మూల సమ్మిరెడ్డి, విద్యుత్ ఏడిఈ వంగల వెంకటనారాయణ, సబ్ ఇంజినీర్ కుమ్మరికుంట సతీష్, ఆర్.ఐ కే. మహేష్, ఇండస్ట్రీయల్ జే.ఈ సృజన్, కాంట్రాక్టర్ నిశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్,జీపీఓ పెరుకు.వెంకటేశ్వర్లు, విద్యుత్ లైన్ మెన్ బంగారు శివ కుమార్, గుండా చందన్ పాల్గొన్నారు.

నూతన బైకును ప్రారంభించిన
మంత్రి శ్రీధర్ బాబు

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు జక్కుల సాయి గౌడ్ పల్సర్ ఎన్ఎస్ 160 బైకును కొనుగోలు చేశాడు. శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు చేతుల మీదుగా నూతన బైకును ప్రారంభించారు. మంత్రి శ్రీధర్ బాబు జక్కుల సాయి గౌడు తో కొంతసేపు సరదాగా బైక్ నడిపారు. నూతన బైక్ కొనుగోలు చేసిన జక్కుల సాయి గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపారు. వాహనం నడిపేటప్పుడు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

పే స్కేల్ కోసం ఉపాధి హామీ ఉద్యోగులు నిరసన

రామగిరి ప్రభాతవార్త



టి. జి. ఆర్. డి. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు రామగిరి మండలంలో విబిజి రాంజీ (ఉపాధి హామీ) ఉద్యోగులు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. టి జి ఆర్ డి జె.ఎ.సి రాష్ట్ర ట్రెజరర్ కొండ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలలో భాగంగా పెన్ డౌన్, షట్ డౌన్ మరియు సహాయ నిరాకరణ చేపట్టడం జరిగిందని తెలిపారు.2 ఫిబ్రవరి 2024 రోజున పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్మెంట్ మంత్రివర్యులు సీతక్క ప్రకటించిన పే స్కేల్ ను వెంటనే అమలు చేసి జీవో ఇవ్వాలని, మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని, ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు, గ్రాట్యూటీ, అలవెన్స్ లు వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమములో ఇంజనీరింగ్ కన్సల్టెంట్. వి. మోనిక, టెక్నికల్ అసిస్టెంట్లు. మల్క అఖిల, నేరెళ్ళ సుప్రియ పాల్గొన్నారు.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే
పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బాధాకరం

జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం చాలా బాధాకరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు.

బాధిత నిరుపేద మహిళకు లయన్స్ క్లబ్ అండ

-సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్
ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు
-క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్

రామగిరి ప్రభాతవార్త



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ నివసిస్తున్న కిరాయి ఇల్లు కూలిపోవడంతో ఆమె తీవ్ర ఇబ్బందులు గుర్తించిన లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు, అండగా నిలచారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, బాధిత మహిళకు శుక్రవారం నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ,అంతర్జాతీయ డైరెక్టర్‌గా ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్‌ల సేవా కార్యక్రమాలకు మార్గనిర్దేశం చేస్తూ సేవే పరమావధి అనే భావనతో లక్షలాది మంది లయన్స్ సభ్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వం, సేవా తపన, నిస్వార్థ అంకితభావం లయన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సమాజ సేవే లయన్స్ ఉద్యమానికి మూల స్ఫూర్తి అని, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి టీవీ సురేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు మొల్కూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, క్లబ్ చైర్‌పర్సన్లు గంట వెంకటరమణ రెడ్డి, మర్రి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

మంథని వార్త



వర్షపు నీరు నిలిచి పత్తి చేన్లు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ముత్తారం మండల వ్యవసాయ అధికారి జే.అనూష

నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు

ముత్తారం, ప్రభాతవార్త:



వర్షపు నీరు నిలిచి పత్తి చేన్లు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని ముత్తారం మండల వ్యవసాయ అధికారి జే అనూష సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గురువారం ముత్తారం మండలంలోని ముత్తారం, మైదాంబండ, మచ్చుపేట గ్రామాల్లో పత్తి క్షేత్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వర్షాల వల్ల చేన్లలో నిలిచిన నీటిని కాల్వల ద్వారా బయటికి పంపించాలని తెలిపారు. నీరు నిలువ ఉన్నచోట వేరుకుళ్ళు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ తో డ్రెంచింగ్, 191919 స్ప్రే చేయాలని సూచించారు. ఆకు రసం పీల్చే పురుగు ఉన్న చేన్లలో మోనోక్రోటోఫాస్ 1:4 నిష్పత్తిలో స్ప్రే చేయాలని రైతులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కె మనీషా, బి శశిధర్, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడిని
పరామర్శించిన మాజీ జెడ్పిటిసి

రామగిరి ప్రభాతవార్త



రామగిరి మండలం బుధవారంపేట తాజా మాజీ సర్పంచ్ దేవునూరి రజిత భర్త కాంగ్రెస్ నాయకులు దేవునూరి శ్రీనివాస్ కు ఇటీవల వెన్నుపూస కు శస్త్ర చికిత్స కాగా మాజీ జెడ్పిటిసి మైదం భారతి వరప్రసాద్ వారి ఇంటికి వెళ్లి శుక్రవారం పరామర్శించారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.వారి వెంచింతల శ్రీనివాసరెడ్డి పొన్నం సత్యనారాయణ గౌడ్ ఉన్నారు.

సంక్షోభంలోకి నెట్టింది
గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాలే

గోదావరిఖని, ప్రభాతవార్త:సింగరేణి సంస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, కార్మికుల హక్కుల ఉల్లంఘనకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల విధానాలే ప్రధాన కారణమని భారతీయ మజ్దూర్ సంఘ్ సింగరేణి బీఎంఎస్ అధ్యక్షుడు అప్పని శ్రీనివాస్ ఆరోపించారు. సింగరేణి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి విషయంలో సమర్థవంతంగా వ్యవహరించకపోవడం వల్ల సంస్థపై సుమారు రూ.54 వేల కోట్ల ఆర్థిక భారం పడిందన్నారు. దేశంలోనే అత్యధిక అప్పులున్న ప్రభుత్వ రంగ సంస్థల్లో సింగరేణి ఒకటిగా మారడం ఆందోళనకరమని పేర్కొన్నారు.కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చొరవ చూపలేదని, దీంతో భవిష్యత్తులో బొగ్గు ఉత్పత్తి, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొత్త బొగ్గు గనులను సంస్థకు కేటాయించేలా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.కార్మికుల సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అప్పని శ్రీనివాస్ విమర్శించారు. సింగరేణి క్వార్టర్ల సమస్యలు, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు, సంక్షేమ పథకాల అమలులో నిరక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ముందుకు రావాలని అన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్ దేశవ్యాప్తంగా ఆగస్టు 17న "డిమాండ్స్ డే" పేరుతో భారీ ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగరేణి అన్ని ఏరియాల్లో కూడా ఈ కార్యక్రమాలను విజయవంతం చేస్తామని చెప్పారు.ఈ సందర్భంగా కార్మిక కోడ్‌లలో కార్మిక వ్యతిరేక నిబంధనలను తొలగించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస ఈపీఎఫ్ పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని, గ్రాట్యుటీ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు వేడుకలు

గొల్లపల్లి, జూలై 31 (ప్రభాతవార్త):



ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యం, ఆరోగ్యం, ఆనందానికి ప్రతీకగా భావిస్తారు. ఈ నేపథ్యంలో గొల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో శుక్రవారం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఒకరికొకరు రకరకాల ఆకర్షణీయమైన డిజైన్లలో గోరింటాకు పెట్టుకుంటూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్ మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో వాతావరణ మార్పులు, వర్షాకాల పరిస్థితుల్లో శరీరంలోని అధిక వేడిని తగ్గించడంలో గోరింటాకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కొత్త నీటిలో ఎక్కువసేపు పనులు చేయడం వల్ల వచ్చే గోరుచుట్టు, చర్మవ్యాధులు, బ్యాక్టీరియా సంక్రమణలను నివారించడంలో గోరింటాకులోని ఔషధ గుణాలు సహాయపడతాయని చెప్పారు. అలాగే చేతులు, కాళ్ల వాపులు, నొప్పులను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగకరమని వివరించారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల గొప్పతనాన్ని నేటి తరానికి చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా రాష్ట్ర సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ చారి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మ, లయన్స్ క్లబ్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి సట్ట సురేష్, ఉపాధ్యాయినులు జలజ, జ్యోతిరాణి, ప్రవంతి, అనూష, సుస్మిత, శ్యామల, గంగ జమున, లత, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కోతకు గురైన వరి పొలాలను సందర్శించిన వ్యవసాయ అధికారులు

ధర్మపురి,ప్రభాతవార్త



గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా నాటు వేసిన వరి పొలాలు కోతకు గురవడంతో మండల వ్యవసాయ అధికారి రాజ కుమార్ శుక్రవారం ఏఈఓతో కలిసి వాటిని సందర్శించారు. మండలంలోని దమన్నపేట గ్రామ శివారులో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో భూమి కోతకు గురై, ఇసుక మేటలు పేరుకపోవడంతో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించి, రైతుల నుండి వివరాలు సేకరించారు. పంట నష్టానికి సంబంధించి అంచనా వివరాలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వారి వెంట గ్రామ ఉపసర్పంచ్ ముత్యాల గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దండవేణి గంగమల్లయ్య, గ్రామానికి చెందిన రైతులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది

మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త;

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జీవితకాలం ప్రజాసేవకే అంకితమైన సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీకి,నర్సంపేట నియోజకవర్గానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉద్యమాన్ని ముందుండి నడిపించారని గుర్తుచేసుకున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా,పోలిట్ బ్యూరో సభ్యుడిగా పార్టీ బలోపేతానికి విశేష సేవలందించారని తెలిపారు. స్వరాష్ట్ర ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ,అన్ని వర్గాలను చైతన్యపరుస్తూ రాష్ట్ర సాధన కోసం తనవంతు కృషి చేశారని కొనియాడారు. జెడ్పీటీసీగా,నర్సంపేట ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి శ్రమించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ తొలి చైర్మన్ గా సమర్థవంతమైన సేవలందించారని పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ,వారి కుటుంబానికి ఈ తీరని లోటును తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

రచయిత రాజుకు సినారె పురస్కారం

చందుర్తి/ ప్రభాతవార్త





చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పెరుక రాజు డాక్టర్ సి. నారాయణరెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు.సినారె జయంతిని పురస్కరించుకుని కళాసేవా సమితి, తెలంగాణ ఆధ్వర్యంలో సినారె సాహితీ పురస్కారం 2026కు రాజును ఎంపిక చేశారు. సినారె జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత కళా పరిషత్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. ఇది ఇలా ఉండగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న డాక్టర్ పత్తిపాక మోహన్ ను మై గిఫ్ట్ రూపశిల్పి. ఆర్మీ అధికారి పెరిక రాజు సన్మానించారు. పేరుక రాజు రచించిన అవ్వ కథల సంపుటి.:సాగు : భారతీయ భాషల అనువాద కథల పుస్తకాలను మోహన్ కు అందజేశారు.

ఉద్యాన వన పంటలతో రైతులకు అధిక లాభాలు

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



ఉద్యానవన పంటలతో రైతులకు అధిక లాభాలు ఉంటాయని మండల ఉద్యాన విస్తరణ అధికారి రాము తెలిపారు శుక్రవారం మండల కేంద్రంతో పాటు గంగారం , పందిల్ల, పెదంపేట్ శివార్లలోని పామాయిల్, కూరగాయ తోటలనుపరిశీలించారు అనంతరం ఆయన మాట్లాడుతూ. రైతులు పంట మార్పిడి చేపట్టాలని వరి, పత్తి, మొక్కజొన్న పంటలకి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లు,పామాయిల్ తోటల సాగు చేపట్టాలని రైతులకు తెలిపారు.ఉద్యాన పంటలైన పామాయిల్,డ్రిప్, స్ప్రింక్లర్,డ్రిప్,పండ్లు, కూరగాయలకూ సంబంధించి అమలులో ఉన్న అన్నీ పథకాల ప్రయోజనాలు రాయితీలు పొందెందుకు తప్పకుండా రైతు రిజిస్ట్రీ పంటల నమోదు తప్పకుండా చేయాలన్నారు.ఈ మేరకు పంట మార్పిడి విధానం ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఈయనతో పాటు డొంకెనా మహేందర్, ముస్కు సంపత్, కూస సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి వార్త

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా నరేష్

పెగడపల్లి, ప్రభాతవార్త:



మండలంలోని ల్యాగలమర్రి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఉప్పులేటి నరేష్, ఉపాధ్యక్షుడిగా న్యాతారి మొండయ్య, ప్రధాన కార్యదర్శిగా లింగంపెల్లి రాజయ్య, కోశాధికారిగా రాము, కార్యదర్శిగా ఉప్పులేటి తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్కటూరి రవి, మాజీ అధ్యక్షుడు వడ్లూరి పెద్ద లింగయ్య, ఉప్పులేటి సత్యం, వడ్లూరి కనుకయ్య, లింగంపెల్లి అంజయ్యతో పాటు పలువురు గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

కరువును కడిగేసిన వానలు..

బీడు భూముల్లో నాట్ల సందడి

పెగడపల్లి, ప్రభాతవార్త:



గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి జిల్లా రైతుల ముఖాల్లో చిరునవ్వులు పూయించాయి. వర్షాభావంతో బీడుగా మారిన పొలాలు ఇప్పుడు నీటితో కళకళలాడుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, వ్యవసాయ కుంటల్లోకి వర్షపు నీరు చేరడంతో ఖరీఫ్ సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులను వేగవంతం చేస్తూ వరి నాట్లలో నిమగ్నమయ్యారు.ఈ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు లేకపోవడంతో సాగు పనులు నిలిచిపోయాయి. నారుమడులు సిద్ధంగా ఉన్నప్పటికీ నీటి కొరత కారణంగా రైతులు నాట్లు వేయలేక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలతో బీడుగా ఉన్న భూముల్లో తగినంత నీరు చేరడంతో ట్రాక్టర్లతో దుక్కి పనులు చేపట్టి, వరి నాట్లను వేగంగా ప్రారంభించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా రైతులు, వ్యవసాయ కూలీలు నాట్ల పనుల్లో నిమగ్నమై వ్యవసాయ క్షేత్రాలు సందడిగా మారాయి.వర్షాలు కురవడంతో పశువులకు మేత సమస్య కూడా కొంతవరకు తగ్గిందని రైతులు చెబుతున్నారు. మరోవైపు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో బోర్లు, బావులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా మరికొన్ని రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తే ఖరీఫ్ సాగు పూర్తిస్థాయిలో సాగుతుందని రైతులు ఆశిస్తున్నారు.ఎన్నో రోజులుగా కరువుతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ఈ వర్షాలు కొత్త ఊపిరినిచ్చాయని, ప్రకృతి కరుణిస్తేనే రైతు బతుకు పచ్చబడుతుందని పలువురు రైతులు పేర్కొన్నారు.

ప్రభుత్వం డీజిల్ ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్,ప్రభాత వార్తప్రభుత్వం డిజిల్ ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన డీజిల్ ఆటో సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు ద్యావరా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అయూబ్ పాషా, గౌరవ అధ్యక్షుడు బొల్లి శేఖర్, ముఖ్య సలహాదారులు కొండూ శ్రీనివాస్‌రావు, ముజీబ్ లతీఫ్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే అలీమ్, న్యాయ సలహాదారులుగా బాధ్యతలు స్వీకరించిన రాచకొండ శ్రీరాములు, తునికి మధుసూదన్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులను జీవన్‌రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో యూనియన్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డీజిల్ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.



సర్కార్ సాంఘీక సంక్షేమ గురుకులంలో సంక్షోభం

జమ్మికుంట/ హుజురాబాద్ , ప్రభాతవార్త:

- నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో బాలికలకు నిద్రలేదు..
- బాత్రూమ్‌లలో పాములు, తేళ్లు..
- నేలపై నిద్ర.. ప్రాణాలతో చెలగాటం..
- పట్టించుకోని ప్రిన్సిపల్..

సర్కార్ సొమ్మంటేనే.. రాజుల సొమ్ము రాళ్ల పాలుగా.. కరీంనగర్ జిల్లా హుజు రాబాద్ నియోజక వర్గంలో నాయకులు, అధికారులు గురుకుల పాఠశాలల కిరాయిల పేరిట సర్కార్ సొమ్మును



పర్సంటేజీల రూపంలో పాలుపంచు కుంటున్నారు. హుజురాబాద్ మండల కేంద్రంలో ఉండవల్సిన తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు) గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర అధికార యంత్రాంగానికి తెలియకుండా జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామ శివారులో ఉన్న కనీస వసతులు లేని ఒక ప్రైవేట్ పాఠశాల ఆవరణలో సంక్షేమ గురుకులాన్ని నడుపుతుండడంతో 490మంది విద్యార్థులు (బాలికలు) పాములు, తేళ్లు, విషపురుగులు మధ్య జీవనం గడుపుతున్నారు. దీనికి తోడు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాఠశాలలో నీరు ఉరుసుడు, తడితో విద్యార్థినీలు గదులలో పడుకునే స్థలం లేక చాపలు పట్టుకుని తెల్లవార్లు గదుల వెంబడి తిరుగుతూ నిద్రలేమితో కాలం గడిపారు. బోరున కురిసన వర్షాలకు విద్యార్థుల బాక్సులు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు సర్వం తడిసిపోయాయి. ఈ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థినీలకు 5వ తరగతి నుండి ఇంటర్మిడియట్ వరకు నేలపై కూర్చొని తరగతులలో పాఠ్యాంశాలు వినడం, నేలపై పడుకోవడం ఇక్కడి సంక్షేమ గురకులంలో ప్రత్యేకత. 650 బాలికలకు గాను ఈ గురుకులంలో 490మంది విద్యార్థినీలు 5వ తరగతి నుండి ఇంటర్ సెకండియర్ వరకు విద్యను అభ్యసిస్తున్నారు. 25మంది వరకు బోదకులు పనిచేస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యార్థుల వెంట ఒకే ఒక ఉపాధ్యాయురాలు, ఇద్దరు వార్డెన్‌లు మాత్రమే ఉంటారు. వర్కర్‌లు రాత్రి 9గంటలకు భోజనాలు అయిపోయిన తర్వాత అందరు వెళ్లిపోతుంటారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు విద్యార్థులు పడరాని పాట్లు పడి నరకయాతనతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న తల్లిదండ్రులు శుక్రవారం గురుకుల పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపల్, ఉపాధ్యాయురాళ్లను ప్రశ్నించడంతో తల్లిదండ్రులను వారి వెంట ఉన్న మీడియా వారిని లోనికి అనుమతించలేదు. ఇక్కడ అంత సుభిక్షం. ఎలాంటి ఇబ్బందులు లేవు.. అంటూ దాటవేసారు. విద్యార్థినీలు (బాలికలు) లబోదిబోమంటూ అంటూ అరిచిన తల్లిదండ్రులను అనుమతించలేదు. గురుకుల పాఠశాలలో బాలికలకు సౌకర్యార్థం ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా టిఫిన్స్, భోజనాలు అందడం లేదంటూ బాలికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మిడియట్ చదువుతున్న ఫస్టియర్, సెకండియర్ బాలికలు తీవ్ర అందోళన వ్యక్తం చేయడంతో సంవత్సరం క్రితం తల్లిదండ్రులు జమ్మికుంట పట్టణంలో ఇంటర్‌మిడియట్ కళాశాల గదులు విద్యార్థులు లేక ఖాళీగా ఉంటున్నాయని, వాటిని వినియోగించడానికి జిల్లా అధికారులకు మొర పెట్టుకోగా, జిల్లా అధికారులు ఇంటర్మిడియట్ విద్యార్థులను గండ్రపల్లి నుండి జమ్మికుంటకు షిఫ్ట్ చేయడానికి అనుమతులు ఇచ్చిన అధికారులు, నాయకులు, ప్రిన్సిపల్ మమేకమై ఏదిగిన బిడ్డలను అక్కడ నేలపై పడుకోబెడుతున్నారు తప్ప.. ఇక్కడ వసతులు ఉన్న జమ్మికుంట ప్రభుత్వ కళాశాలలోకి షిఫ్ట్ చేయడంలేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి అన్ని తడిసిపోవడంతో మూడు గదులలో అందరిని పడుకోబెడుతున్నారని చిన్నారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయురాలు దృష్టికి తీసుకెళ్లిన ఆమె స్పందించడంలేదని శుక్రవారం పాఠశాల వద్ద ప్రిన్సిపల్ తీరుపై నిప్పులు చెరిగారు. 200మంది నివాసం ఉండే ప్రైవేట్ పాఠశాలలో 490మందిని ఇరుకు గదులలో ఉరుస్తున్న స్లాబ్‌లలో నివాసం ఉంచడం ఎంత వరకు సంక్షేమమని తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

బాత్రూమ్‌లలో పాములు, తేళ్లు.. నిద్ర పట్టడంలేదు.. విద్యార్థుల ఆందోళన



ప్రైవేట్ పాఠశాల ప్రాంగణాన్ని అద్దెకు తీసుకుని నేలకు 5లక్షల రూపాయల పైచిలుకు కిరాయిలు చెల్లిస్తూ, నాయకులు, అధికారులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పాఠశాలకు చుట్టూ పంట పొలాలు, పత్తి చేన్లు, రేగడి నేల ఉండడంతో పాములు, తేళ్లు, జర్రిలు వస్తున్నాయని ఇప్పటికి అనేక మార్లు పాములను, తేళ్లను చంపడం జరిగిందని విద్యార్థినీలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం బాత్రూమ్‌లో పెద్ద కట్ల పాము పడుకుని ఉందని, టీచర్‌ల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఎప్పుడు ఈ గురుకులంలో బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నామని విద్యార్థినీలు కన్నీంటి పర్యాంతమవు తున్నారు. అదృష్టవశాత్తు ఇక్కడున్న వాతవారణంలో ఇంత వరకు ఎవరికి ఏమి కాకపోవడం ఈ ప్రాంత నాయకులు, అధికారులు బతికి బట్ట కడుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరం క్రితమే జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖాళీగా ప్రాంగణానికి మార్చలని ఉత్తర్వులు వచ్చిన ప్రిన్సిపల్, అధికారులు, నాయకులు, ఎందుకు ఇక్కడి నుండి షిఫ్ట్ చేయడంలేదో..? తల్లిదండ్రులకు వెల్లడించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలోకి తల్లిదండ్రులను సైతం శుక్రవారం అనుమతించకపోవడంతో సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది. ఈ విషయాన్ని పలువురు విద్యావేత్తలు మీడియా దృష్టికి, జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి (సిఎంవో) తీసుకెళ్లిన పలువురు మీడియాకు వెల్లడించారు. ఇప్పటికైన ఎలాంటి వసతులులేని ప్రైవేట్ పాఠశాల నుండి యధావిధిగా హుజురాబాద్‌కు కానీ, జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ప్రాంగణానికి గురుకులాన్ని షిఫ్ట్ చేయకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్తామని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

భారీ వర్షాలతో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

- ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వరద నీరు
- నిలిచిన యంత్రాలు
- 40 వేల టన్నులకుపైగా ఉత్పత్తి నష్టం
- కోట్లలో ఆర్థిక ప్రభావం

గోదావరిఖని, ప్రభాత వార్త: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి భారీగా వరద నీరు చేరడంతో శుక్రవారం నాటికి పలు ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. గనులలో బురద పేరుకుపోవడంతో భారీ యంత్రాలు పనిచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో బొగ్గు తవ్వకం, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు స్తంభించిపోయాయి. రామగుండం, ఇల్లందు, మణుగూరు, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ప్రాంతాల్లోని ఓపెన్‌కాస్ట్ గనులు వర్ష ప్రభావానికి గురయ్యాయి. వరద నీరు భారీగా చేరడంతో షవల్స్, డంపర్లు, స్క్రాపర్లు తదితర యంత్రాలు గనుల్లోకి వెళ్లలేక యార్డులకే పరిమితమయ్యాయి. దీంతో రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 40 వేల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, లక్షల క్యూబిక్ మీటర్ల



ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు కూడా ఆగిపోయాయి. ఈ పరిణామాలతో సింగరేణికి కోట్ల రూపాయల మేర ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గనుల్లో నిలిచిన వరద నీటిని బయటకు పంపేందుకు భారీ సామర్థ్యమున్న మోటార్లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో అంతరాయం కలగకుండా స్టాక్‌యార్డుల్లో నిల్వ ఉన్న బొగ్గును రవాణా చేసే ఏర్పాట్లు చేశారు. వర్ష తీవ్రత తగ్గి గనుల్లోని నీరు పూర్తిగా తొలగిన తర్వాత పరిస్థితిని సమీక్షించి దశలవారీగా బొగ్గు ఉత్పత్తిని పునఃప్రారంభిస్తామని సింగరేణి అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి,ప్రభాతవార్త:



భారీ వర్షాల కారణంతో గోదావరి నదితోపాటు , పలు వాగుల్లో నీటి ప్రవాహం పెరిగినందున చుట్టుపక్క ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మూడు రోజులు ఎడతెరిపిలేని కురిసిన భారీ వర్షాల కారణంతో మండలంలోని రాయపట్నం గోదావరి ప్రవాహాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. గోదావరి నదిలోకి వస్తున్న ఇన్ ఫ్లో, వరద నీరు పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆకు సాయిపల్లె నాగారం గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డుతో పాటు నరసయ్య పల్లి కొత్త కొరండ్లపల్లి పల్లి గ్రామాల మధ్య కొత్త గురైన కల్వర్టు ను పరిశీలించారు. కోతకు గురైన రోడ్లను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్ తదితరులున్నారు.

వచ్చే వారంలో ఖిలా వనపర్తి సోలార్ ప్లాంట్ ప్రారంభం

-కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ప్రభాతవార్త:



ధర్మారం మండలంలోని ఖిలా వనపర్తి గ్రామంలో నిర్మాణం పూర్తయిన సోలార్ ప్లాంట్‌ను వచ్చే వారం ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధర్మారం మండల పరిధిలోని ఖిలా వనపర్తి సోలార్ ప్లాంట్‌తో పాటు ఎలిగేడు మండలంలో ప్రతిపాదిత గోదాం స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించిన కలెక్టర్, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకల ఏర్పాట్లు పూర్తి చేసి వచ్చే వారంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం ఎలిగేడు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో నిర్మించనున్న 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థం గల ధాన్యపు గోదాం స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోదాం నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. టెండర్ల ప్రక్రియ ముగియగానే నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఆధునిక ధాన్యపు నిల్వ సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి తెచ్చేలా పనులను వేగవంతం చేయాలని, నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ మాల, ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, ఎలిగేడు తహసిల్దార్ యాకన్న, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హస్నాబాద్‌లో చింతనూరి భూమారావు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల,అర్బన్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం అర్బన్ హస్నాబాద్ గ్రామానికి చెందిన స్థానిక నాయకులు చింతనూరి భూమారావు భార్య శ్యామల మరణించగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ హస్నాబాద్‌లోని వారి నివాసానికి చేరుకుని, శ్యామల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న భూమారావుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా పెరుగుతున్న వరద నీరు

గోదావరి నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రాజెక్టు దిగువన గల ప్రజలకు, రైతులకు అధికారుల హెచ్చరికలు

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా పెరుగుతున్న వరద నీరు దృష్ట్యా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. కడెం ప్రాజెక్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేయడం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువన ఉన్న క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు దిగువన ఉన్న గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, పల్లెకారులు, ఇతరులు నది ఒడ్డుకు లేదా నదీ ప్రవాహ ప్రాంతంలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 148.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 146.53 మీటర్ల వద్ద నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థం 20.1754 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.2107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు మొత్తం ఇన్ ఫ్లో 1,91,275 క్యూసెక్కులుగా వస్తుండగా, అందులో కడెం ప్రాజెక్ట్ నుంచి 1,17,307 క్యూసెక్కులు, క్యాచ్ మెంట్ ప్రాంతాల నుంచి 73,968 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇక ప్రాజెక్టు నుంచి మొత్తం అవుట్ ఫ్లో 16,025 క్యూసెక్కులుగా ఉంది. ఇందులో నంది పంప్ హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కులు, హైదరాబాద్ తాగునీటి సరఫరా (హెచ్ ఎం డబ్ల్యూ ఎస్) కోసం 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంశాగర్, గూడెం, ఎన్టీపీసీ, వేమనూర్, రామగుండం ఎత్తిపోతల పథకం నుంచి ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో నిల్ గా నమోదైంది. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదీ తీర ప్రాంత ప్రజలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి బాధ్యతలు

నూతన అధికారికి జీఎం డి. లలిత్ కుమార్ శుభాకాంక్షలు

సంస్థ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని సూచన

ముప్పిడి రవీందర్ రెడ్డికి ఘన వీడ్కోలు

నూతన పర్సనల్ మేనేజర్‌కు ఉద్యోగుల అభినందనలు

గోదావరిఖని, ప్రభాత వార్త:

సింగరేణి రామగుండం ఏరియా1 పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ నూతన అధికారిని అభినందించి, ఉద్యోగులు, కార్మికులు, యాజమాన్యం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పర్సనల్ విభాగంలో తన పరిపాలనా అనుభవం, సమర్థ నాయకత్వంతో సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తారనే విశ్వాసాన్ని జీఎం వ్యక్తం చేశారు. అనంతరం పదవీ విరమణ పొందిన పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సేవలను కొనియాడుతూ కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయబద్ధంగా నూతన పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతిని అధికారికంగా బాధ్యతల కుర్చీలో ఆసీనులను చేసి బాధ్యతలను అప్పగించారు. అనంతరం పర్సనల్ అధికారులు వేణు, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, పీవో దేవాచారి, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నూతన పర్సనల్ మేనేజర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.



ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత తప్పనిసరి

వర్షపు నీటి సంరక్షణతోనే భూగర్భ జలాల పెంపు

డిపాజిట్ రుసుము తిరిగి చెల్లింపు

ప్రజలకు మేయర్, కమిషనర్ పిలుపు

గోదావరిఖని ,ప్రభాతవార్త:

వర్షపు నీటిని వృథా కాకుండా భూగర్భ జలాల్లోకి మళ్లించేందుకు నగరంలోని ప్రతి ఇంటితో పాటు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని రామగుండం మేయర్ మహంకాళి స్వామి, కమిషనర్ జె. అరుణ శ్రీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, భవన నిర్మాణ అనుమతి పొందే సమయంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్ నిర్మాణం కోసం డిపాజిట్ రుసుము వసూలు చేస్తున్నామని తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకుడు గుంత ఫొటోలు, వివరాలను నగర పాలక సంస్థకు సమర్పిస్తే డిపాజిట్ మొత్తాన్ని పూర్తిగా తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమలవుతున్న ఖిజల్ సంచయ్ జన భాగీదారిఖి కార్యక్రమంలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రతి నీటి బొట్టును భూగర్భ జలాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్న వారు వాటిని శుభ్రపరిచి వినియోగంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వస్తే భూగర్భ జలమట్టం పెరగడమే కాకుండా భవిష్యత్ తరాలకు నీటి కొరత తలెత్తకుండా ఉంటుందని తెలిపారు.

30 ఏళ్ల సేవకు ఘన వీడ్కోలు



పారిశుద్ధ్య కార్మికుడు దేవయ్య సేవలను కొనియాడిన అధికారులురామగుండం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పీహెచ్ వర్కర్‌గా పనిచేసిన పంగ దేవయ్య శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ప్రభుత్వ వాహనంలో గౌరవప్రదంగా ఆయనను సాగనంపారు. సుమారు మూడు దశాబ్దాలపాటు విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన దేవయ్య, ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని అధికారులు కొనియాడారు. గైర్హాజరు కాకుండా బాధ్యతాయుతంగా సేవలందించి సహచర ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. వీడ్కోలు కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్, జూనియర్ అసిస్టెంట్ నాయిని చంద్రారెడ్డి, సానిటరీ జవాన్ సూర్యతో పాటు నగర పాలక సంస్థకు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొని దేవయ్యకు శుభాకాంక్షలు తెలిపారు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞల పొడిగింపు

అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్ సిస్టమ్‌లపై కఠిన చర్యలు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞల పొడిగింపు చేపట్టినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, వీధులు, రహదారులపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని సీపీ పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు 01082026 నుండి 01092026 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం 1348 ఫసలీ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శబ్ద కాలుష్యం నివారించేందుకు డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపైనా నిషేధం పొడిగించినట్లు వివరించారు. మైక్ సెట్ల వినియోగానికి సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు.

వీర్లపల్లిలో వైద్య శిబిరం..

121 మందికి పరీక్షలు



వరద ప్రభావిత గ్రామంలో ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలుత్రాగునీరు, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహనడీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీస్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొనడంగోదావరిఖని, ప్రభాతవార్త: ....వరద ప్రభావిత వీర్లపల్లి గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కన్ సింగ్ చొరవతో, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు పట్టణ 21వ డివిజన్ పరిధిలోని లక్ష్మీ ్మపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ బి. మాణికేశ్వర్ రెడ్డి 121 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ పవిత్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులు, సురక్షిత త్రాగునీటి వినియోగం, పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై వైద్య బృందం అవగాహన కల్పించింది. వర్షాకాలంలో జ్వరం, విరేచనాలు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్, డివిజన్ ఇన్‌చార్జి కొకిరాల శ్రీనివాస్, సూపర్‌వైజర్లు ఎన్. పారిజాతం, ఎం. తిరుపతి, ఏఎన్ఎంలు జయప్రభావతి, శ్రీమతి, ఆశా కార్యకర్తలు ఎం. రజిత, ఏ. అనంతలక్ష్మి ్మ, శానిటరీ సూపర్‌వైజర్ ఏ. శ్రీనివాస్‌తో పాటు గ్రామ పెద్దలు అర్జున్‌రావు, జూపల్లి వేణు, బాదే శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆగస్టు 7 వరకు అవకాశం

బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులకు అర్హత

గోదావరిఖని అధ్యయన కేంద్రంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మీసేవ, నెట్ సెంటర్ల ద్వారా దరఖాస్తుల స్వీకరణ

గోదావరిఖని, ప్రభాత వార్త:



2026-27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం (స్టడీ సెంటర్-055) అధికారులు తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా (10+2) ఉత్తీర్ణులైన అభ్యర్థులు మీ సేవ లేదా నెట్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెండో, మూడో సంవత్సరం విద్యార్థులు కూడా ఫీజు చెల్లింపును ఇదే గడువులో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 7ను అడ్మిషన్లతో పాటు రెండో, మూడో సంవత్సరం విద్యార్థుల ఫీజు చెల్లింపునకు చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా విద్యార్థులు ముందుగానే దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో లెర్నర్ సపోర్ట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీన్ (స్టూడెంట్ అఫైర్స్) ప్రొఫెసర్ బి. శ్రీనివాస్, రూరల్ ఇన్‌స్టిట్యూషన్ ఛైర్మన్ డాక్టర్ ఎన్. కిషన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జకియా సుల్తానా, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బి. సుబ్బారావు పాల్గొన్నారు. ప్రవేశాలకు సంబంధించిన వివరాల కోసం 7382929655, 9849740479 నంబర్లను సంప్రదించాలని అధికారులు కోరారు.

ఏఎస్ఐ సంజీవయ్య సేవలు అభినందనీయం

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

గోదావరిఖని వన్‌టౌన్ ఏ ఎస్ ఐ సంజీవయ్యకు పోలీసు కమిషనరేట్‌లో ఘన వీడ్కోలు సత్కారం

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



ఏ ఎస్ ఐ సంజీవయ్య సేవలు అభినందనీయం అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కొనియాడారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘకాలంగా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధి నిర్వహణలో ఉంటూ పదవీ విరమణ పొందిన సంజీవయ్యను శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శాలువా కప్పి, సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలోనూ సుదీర్ఘ సర్వీసు అనంతరం ఉద్యోగ విరమణ పొందడం అనేది అత్యంత సహజమైన ఒక ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. తన ఉద్యోగ జీవితంలో పోలీసు శాఖ ద్వారా ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎన్నో సంవత్సరాల పాటు క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావంతో పనిచేసి ఉన్నతాధికారుల మెప్పు పొందిన సంజీవయ్య సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి మచ్చ లేకుండా విజయవంతంగా సర్వీసు పూర్తి చేసుకోవడం విశేషమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం రాబోయే శేష జీవితంలోనూ మీకు ఎలాంటి సమస్యలు లేదా అత్యవసర అవసరాలు ఎదురైనా సరే పోలీస్ శాఖ ఎల్లవేళలా ఒక కుటుంబ సభ్యుడిగా పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని సీపీ హామీ ఇచ్చారు. పదవీ విరమణ చేసిన సంజీవయ్య, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సంతోషంగా జీవించాలని, వారి పిల్లలు సమాజంలో మరింత ఉన్నత స్థాయిలకు ఎదిగి జీవితంలో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ రమేష్, ఆర్ ఐ రమేష్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, సీసీ సందీప్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో సోక్‌పిట్ నిర్మించాలి



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో సోక్‌పిట్ నిర్మించాలి అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణ శ్రీ తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని, ఇంకుడు గుంత లేని ఇళ్లకు ఇంటి నంబర్, తాగునీటి నల్లా కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇప్పటికే నిర్మించబడిన ఇళ్లలో కూడా వీలైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డు పరిధిలో వచ్చే నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా వార్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. రహదారులపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.

కల్లెడలో ఎస్సారెస్పీ కాలువ పూడ్చివేతపై నిరసనలు

స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి



జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ కల్లెడ గ్రామంలో నీటిపారుదల కాలువ ఆక్రమణ కారణంగా బాటసారులు,గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్న ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.ఎస్సారెస్పీ పరిధిలోని పొట్రినారు కాలువను నిబంధనలకు విరుద్ధంగా పూడ్చివేసి, దాని స్థానంలో చిన్నపాటి సిమెంట్ పైపులను అమర్చడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. సాధారణంగా సమృద్ధిగా వర్షాలు కురిసిన వేళ కాలువ గుండా సాఫీగా సాగిపోవాల్సిన వర్షపు నీరు,ప్రవాహానికి తగినంత మార్గం లేకపోవడంతో పూర్తిగా నిలిచిపోయి రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీనివల్ల నిత్యం ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు,బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రహదారిపై భారీగా నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోవడం, ప్రమాదాలు సంభవించే అవకాశం పెరగడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఎస్సారెస్పీ కాలువల నిర్మాణం కోసం ప్రభుత్వం నిబంధనల ప్రకారం భూములను సేకరించి,సంబంధిత భూమి యజమానులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన విషయాన్ని ఈ సందర్భంగా స్థానికులు గుర్తుచేస్తున్నారు.ప్రభుత్వం నుంచి తగిన పరిహారం చెల్లింపులు జరిగినప్పటికీ,ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కాలువను ఈ విధంగా పూడ్చివేయడం,రహదారి భద్రతను ప్రమాదంలో పడేయడం ఏమాత్రం తగదని,నిబంధనల ఉల్లంఘన వల్ల ఊరంతా,రాకపోకలు సాగించే ఇతర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి రావడం శోచనీయమని వాపోతున్నారు.ఈ అక్రమ నిర్మాణంపై సమాచారం అందుకున్న ఎస్సారెస్పీ అధికారులు ఇప్పటికే సదరు వ్యక్తికి పలుమార్లు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.ప్రభుత్వ ఆస్తి అయిన కాలువను ఆక్రమించడం,ప్రవాహానికి అడ్డంకులు సృష్టించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.ప్రస్తుత పరిస్థితుల్లో నిలిచిపోయిన వర్షపు నీటి కారణంగా రహదారి తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది.దీనివల్ల ప్రయాణికుల రవాణా సౌకర్యాలకు విఘాతం కలగడమే కాకుండా,స్థానిక ప్రజల రోజువారీ కార్యకలాపాలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి ఆక్రమణలను తక్షణమే అడ్డుకోవాలని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా కాలువను పాత పద్ధతిలోనే పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు,వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.సంబంధిత యంత్రాంగం త్వరితగతిన స్పందించి,ప్రవాహ మార్గాన్ని సరిచేసి రహదారిపై నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డబుల్ బెడ్ రూమ్‌లో మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ కు లేఖ రాసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల పట్టణ పరిధిలోని నూకపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల లేమిపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు..నిరుపేదల గృహ నిర్మాణ నిమిత్తం 2008లో సేకరించిన స్థలంలో 4,000 ఇళ్లను నిర్మించినప్పటికీ, సరైన సదుపాయాలు కల్పించకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఈ కాలనీ జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని 10,11 వార్డుల కిందకు వస్తుందని,దాదాపు 4,000 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ తాగునీరు, డ్రెయినేజీ,పారిశుద్ధం,వీధిదీపాల నిర్వహణను పురపాలక సంఘం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.కాలనీలో పేరుకుపోతున్న చెత్తాచెదారం, డ్రెయినేజీ సమస్యల వల్ల నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక డొంపింగ్ యార్డ్ కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.కాలనీ పారిశుద్ధ్య నిర్వహణ కోసం తక్షణమే నలుగురు ప్రత్యేక సిబ్బందిని, చెత్త ఉచిత తరలింపునకు ట్రాలీ ఆటోలను కేటాయించాలని ఆయన కోరారు.

రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:

జగిత్యాల పట్టణంలోని 33/11 కేవీ టౌన్ సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమరికతో పాటు లైన్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆగస్టు 1 (శనివారం) ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.ఈ కారణంగా కృష్ణనగర్, ఆరవిందనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరిస్తామని, ఈ సమయంలో వినియోగదారులు సహకరించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

జీపీ నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లించబోం

సర్పంచుల ఏకగ్రీవ తీర్మానం



ప్రభాత వార్త కోనరావుపేట కోనరావుపేట మండల సర్వసభ్య సమావేశంలో గ్రామపంచాయతీల ఆర్థిక సమస్యలు ప్రధాన చర్చగా మారాయి. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ సర్పంచులు వీధి దీపాలు, బోరు మోటార్ల విద్యుత్ బిల్లులను గ్రామపంచాయతీ నిధుల నుంచి చెల్లించబోమని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు ఎంపీడీవో స్నిగ్ధ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామపంచాయతీలపై జీపీడీపీ నిబంధనలను వర్తింపజేయవద్దని వినతిలో కోరారు. గ్రామపంచాయతీలకు తగిన నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు, నిర్వహణ భారంగా మారిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.

సమాజ సేవలో విక్టరీ యూత్

కోనరావుపేటరూరల్,ప్రభాతవార్త:మండలంలోని మామిడిపల్లి



శ్రీసీతారామస్వామి ఆలయం ఆవరణలో విక్టరీ యూత్ క్లబ్ సభ్యులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1994వ సంవత్సరంలో కుల మతాలకు అతీతంగా యూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగానే సమాజ సేవలో ముందుండి, ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడు అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఇక్కడ యూత్ సభ్యులు తిరుపతిరెడ్డి, కుంటయ్య, వేణుగోపాల్, నాగరాజు, మహేందర్, బీరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రహిత్, రహీమ్, అంజనేయులు, మల్లేశం, బీరయ్య, తిరుపతి, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

గంజాయి చిక్కుముడి వీడినట్లేనా ?

ఘటన లో తేలాల్సిన బాద్యులు

ఉలిక్కి పడిన చిగురుమామిడి మండలం

చిగురుమామిడి, ప్రభాత వార్త :



చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో గత వారం రోజుల కింద ఒక ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణం లో గంజాయి చలామణి ? అనే వార్త దావానంలా మండలంలో వ్యాపించింది. ఈ కేసుకు సంబంధించిన వాస్త, అవాస్తవాలు చూస్తే ఖంగు తినాల్సిందే. ఒక వ్యక్తి మీద ఉన్న పగతో ఎక్కడి నుండో కొంత గంజాయిని తీసుకొచ్చి ఇదే ఆగ్రోస్ ఫర్టిలైజర్ యజమాని దుకాణం లో స్వయంగా ఒక ఈగల్ టీమ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ వేసి దుకాణం యజమాని అయిన మట్ట శ్రీనివాస్ రెడ్డి ని ఇరికించే ప్రయత్నం లో భాగంగా టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించి పక్కా గా స్కెచ్ వేశాడు సదరు కానిస్టేబుల్ నాగరాజు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆగ్రోస్ ఫర్టిలైజర్ సోదా చేయడం, గంజాయి దొరకడం, దుకాణ యజమాని శ్రీనివాస్ రెడ్డి ని కస్టడీ లోకి తీసుకోవడం క్షణాల్లో జరిగిపోయింది. నేను ఈ నేరం చేయలేదని, ఆ దొరికిన గంజాయి కి నాకు ఎటువంటి సంబంధం లేదని మొదటి నుండే ఆవేదన పోలీసులకు శ్రీనివాస్ రెడ్డి చెబుతూ వచ్చాడు. ఈ కేసులో పోలీసుల విచారణ తీవ్రం కావడం, అసలు దోషిగా, గంజాయి దుకాణం లో పథకం ప్రకారం వేసింది ఈగల్ టీమ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ నాగరాజు అని పోలీసులు తేల్చారు. ఈ కేసులో అసలు ట్విస్ట్ కొండాపూర్ గ్రామానికి చెందిన ఒక మిత్రుడికి సంబందించిన భూవివాదాం లో మట్ట శ్రీనివాస్ రెడ్డిని ఇరికించే పథకం లో భాగంగా గంజాయి డ్రామా ఆడారు. కానీ డ్రామాను పోలీసులు చిత్తు చేశారు. గంజాయి వార్తతో చిగురుమామిడి మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

గంజాయి ప్లాన్ కి సహకరించిన వారు ఎందరు?

ఇట్టి గంజాయి తతంగంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరో పూర్తిగా పోలీసులు తేల్చాల్సి ఉంది. ఇంత సులభంగా గంజాయి ఎలా దొరికింది ? ప్రజలను రక్షి ంచవలసిన ఒక బాధ్యత గల ఈగల్ టీం పోలీస్ కానిస్టేబుల్ ఈ విధంగా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం సిగ్గుచేటు.

ముంబై, హైదరాబాద్ నుంచి తరలివచ్చిన ట్రాన్స్ జెండర్లు...

-- సాంప్రదాయ పద్ధతిలో ముగిసిన అంత్యక్రియలు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ట్రాన్స్ జెండర్ రొంటాల కుమార్ (శుక్రవారం) తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుమార్ తుదిశ్వాస విడవడంతో స్థానికంగా, అలాగే ట్రాన్స్ జెండర్ల కమ్యూనిటీలో



విషాదఛాయలు అలుముకున్నాయి. కుమార్ మరణవార్త తెలుసుకున్న వెంటనే కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, దేశ ఆర్థిక రాజధాని ముంబై తదితర సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ట్రాన్స్ జెండర్లు హుజురాబాద్‌కు చేరుకున్నారు. తమ తోటి సభ్యుడిని కడసారి చూసేందుకు వారు భారీగా తరలిరావడంతో గాంధీనగర్ ప్రాంతం అంతా వారి రోదనలతో మిన్నంటింది. మృతుడు కుమార్ పార్థివ దేహానికి ట్రాన్స్ జెండర్ల ప్రత్యేక ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాంధీనగర్ నుంచి స్థానిక శ్మశాన వాటిక వరకు భారీ అంతిమయాత్రను నిర్వహించారు. ఈ యాత్రలో వందలాది మంది ట్రాన్స్ జెండర్లు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. దారిపొడవునా కుమార్ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వారు కంటతడి పెట్టుకున్నారు. అంతిమ యాత్ర సాగినంత మేరా వాతావరణం అత్యంత విషాద భరితంగా మారింది. ఈ అంతిమ సంస్కారాల కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ బొరగాల మొగిలితో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కుమార్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని, ధైర్యాన్ని తెలియజేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని ఆర్డీవోకు వినతి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:



రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని కోరుతూ హుజురాబాద్ ఆర్డీఓ జల కుమారికి బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గం మహిళా ప్రధాన కార్యదర్శి దేవసాని ప్రియదర్శిని, బిసి జేఏసి గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, అధ్యక్షుడు సందేల వెంకన్న, కన్నెబోయిన రాజయ్య, సమ్మయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి

-- హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

-- ఎస్ఐఆర్, ప్రజావాణి, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష...

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

ప్రజలకు సంబంధించిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. శుక్రవారం రాత్రి హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆమె కార్యాలయ పనితీరును పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అనంతరం ఆర్డీవో జల కుమారి, తహశీల్దార్



నరేందర్‌తో సమావేశమై డివిజన్ పరిధిలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఆరా తీశారు. ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్డీవోకు సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. అదే విధంగా ప్రజావాణిలో అందుతున్న వినతులు, భూ భారతి-సాదా బైనామా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఎలాంటి జాప్యం లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలో పారిశుద్ధం, ఆరోగ్య సేవలు, తాగునీటి సరఫరా, వర్షాకాలంలో చేపడుతున్న ముందస్తు చర్యలపై కూడా కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు.

గొర్రెల పెంపకదారుల జిల్లా డైరెక్టర్ గా సదానందం

చిగురుమామిడి, ప్రభాత వార్త :

శుక్రవారం రోజున కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన జిల్లా గొర్రెల పెంపక దారుల ఎన్నికలలో కరీంనగర్ జిల్లా డైరెక్టర్ గా చిగురుమామిడి గ్రామానికి చెందిన ముక్కెర సదానందం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



జిల్లా డైరెక్టర్ గా తనను ఎన్నుకున్న యాదవ కుల బాందవులకు కృషి చేసిన రాష్ట్ర, జిల్లా గొర్రెల పెంపక దారుల కమిటీ నాయకులకు సదానందం కృతజ్ఞతలు తెలిపారు. చిగురుమామిడి మండల, వివిధ గ్రామాల యాదవ కమిటీ సభ్యులు కూడా అభినందనలు తెలిపారు.

అడ్డుకోవాల్సింది పోయి.... అడ్డంగా బుక్కయ్యాడు

గంజాయితో దొరికిన ఈగిల్ టీం కానిస్టేబుల్ వివరాలు వెల్లడించిన ఏసిపి

కరీంనగర్ క్రైమ్ ప్రభాతవార్త:

మాదకద్రవ్యాల నియంత్రణ విభాగంలో పనిచేస్తూ స్నేహితుని కోసం అతని ప్రత్యర్థి పై అక్రమ కేసు పెట్టేందుకు గంజాయి నిల్వచేసిన ఈగల్ టీం కానిస్టేబుల్ ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుని వివరాలను కొత్తపెల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ ఏసిపి విజయ్ కుమార్ వెల్లడించారు. కరీంనగర్ మండలం సీతారాంపూర్ లో నివాసముంటున్న ఈగల్ టీం కానిస్టేబుల్ మెడబోయిన నాగరాజు వద్ద గంజాయి నిల్వ ఉందన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 370 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



నాగరాజును విచారించగా చిగురుమామిడి మండలం కొండాపూర్ కు చెందిన శ్రీనివాస్ కు నాగరాజుకు పరిచయం ఉంది. అదే గ్రామంలో శ్రీనివాస్ కు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తులకు మధ్య భూతగాదాలు ఉండడంతో అవి ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించిన కొలిక్కి రాకపోవడంతో అతన్ని కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో నాగరాజు శ్రీనివాసులు కలిసి పథకం పన్నారు. స్నేహితుని కోసం కానిస్టేబుల్ నాగరాజు వరంగల్ నుంచి గంజాయి తెప్పించి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఎరువుల దుకాణంలో పెట్టాడు. తిరిగి పోలీసులకు సమాచారం అందించి చిరుమామిడి పోలీస్స్టేషన్లో కేసు నమోదయ్యేలా చేసి కటకటాల పాలు చేశారు. వరంగల్ నుంచి తెప్పించిన గంజాయిలో కిలో గంజాయి శ్రీనివాస్ రెడ్డి దగ్గర దొరికినట్లు చూపించగా మిగిలిన 3 70 గ్రాముల గంజాయిని తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు నాగరాజు ఇంట్లో దాడులు నిర్వహించి గంజాయి తోపాటు నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసిపి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఏసిపి వెంట ఇన్స్పెక్టర్ లు కోటేశ్వర్, బొల్లం రమేష్, పాల్గొన్నారు.

పదవీ విరమణ పోలీసులకు సన్మానం

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం విశేష సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం కమీషనరేట్ కార్యాలయంలో జరిగింది. కరీంనగర్ వన్ టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె.కరుణాకర్,కొత్తపల్లి హెడ్ కానిస్టేబుల్ టి.జగన్ మోహన చారిలు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. అనంతరం డిసీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ (సంక్షేమం) కిరణ్ కుమార్ , కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడాల సురేందర్ ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విద్యారంగానికి ఆంజనేయ రావు సేవలు అమోఘం

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

ప్రభుత్వ విద్యారంగానికి హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. ఆంజనేయ రావు చేసిన సేవలు అమోఘమని, ఆయన అందరికీ ఆదర్శంగా నిలుస్తారని హుజురాబాద్ ఆర్డీఓ జలకుమారి కొనియాడారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఆంజనేయ రావు పదవీ విరమణ సన్మాన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీఓ జల కుమారి మాట్లాడుతూ... అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా, డీఐఈఓ గా బాధ్యతలు నిర్వర్తించి ఆయన విద్యాశాఖలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ప్రశంసించారు. వృత్తి పట్ల ఆయన చూపిన అంకితభావం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఆంజనేయ రావు దంపతులను తోటి అధ్యాపకులు, విద్యార్థులు, అతిథులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ సత్యవర్ధన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా దేవి, ఇంచార్జీ ప్రిన్సిపాల్ తులసీదాస్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సుగుణ, విజేందర్ రెడ్డిలతో పాటు సత్యనారాయణ రెడ్డి, కనకయ్య, రాజేశ్వర రావు, కుమార్, మురళీ మోహన్, వాసుదేవ రావు, వనమాల, ప్రసాద్, రాజశేఖర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

